




# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :34 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 12 జూన్ 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## నామినేటెడ్ రెన్యువల్స్ కష్టమే...




**వరంగల్, జూన్ 11:**ఒక్కొక్కటి రెన్యువల్ అవుతున్నాయి..! మరి మా సంగతి ఏంటి..? వాళ్ళకే అవుతాయా మాక్కూడా రెన్యువల్ చేయండి ప్లీజ్..అంటూ నేతల ముందు అప్పీల్ చేస్తున్నారు. ఇంతకి అయ్యేది ఎందరికి...హ్యాండ్ ఇచ్చేది ఎవరికి..!? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 37 మంది నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. 2023 ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వాళ్లు కొందరు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఇంకొందరు ఆ లిస్ట్‌లో ఉన్నారు. వాళ్ళ పదవీకాలం జులైతో ముగుస్తుంది. అదే సమయంలో కొత్తగా పదవుల కోసం చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జూన్ వచ్చేసింది...ఇక జులై వచ్చేస్తుంది...అంటూ రోజులు లెక్కబెట్టుకుంటున్నారు. సరిగ్గా ఇక్కడే తేడా కొడుతోందట. పదవుల కోసం కొత్తగా ఎదురుచూస్తున్న వాళ్ళు ఎంత ఆశతో ఉన్నారో... ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఉన్న నాయకులు కూడా అంతే ఆశతో రెన్యువల్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు 37 మంది కార్పొరేషన్ చైర్మన్స్ - మిగతా3లో

## అడుగుంటున్న భూగర్భ జలాలు..

### నగరంలో 3 శాతం మాత్రమే నీరు...

**హైదరాబాద్, జూన్ 11:**హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న వేళ నగరవాసులను ఓ పెను ముప్పు ముంచెత్తబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగుంటుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 స్పష్టం చేసింది. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ఆశ్రయమిస్తున్న హైదరాబాద్ నగరంలో - మిగతా3లో





## ఒకే ట్రాక్‌పైకి ఎదురెదురుగా వచ్చిన రైళ్లు!



**భువనేశ్వర్(ఒడిశా) జూన్ 11**: ఒడిశా రాజధాని భువనేశ్వర్ సమీపంలో ఇవాళ (జూన్ 11) ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఎదురెదురుగా రావడంతో కలకలం రేగింది. రైల్వే సిబ్బంది సమయానుకూలంగా స్పందించడంతో ఒక పెద్ద రైలు ప్రమాదం త్రుటిలో తప్పింది. ఈ ఘటన భువనేశ్వర్‌లోని అత్యంత రద్దీగా ఉండే 'ఝార్పడ' ( వంతెన సమీపంలో చోటుచేసుకుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే (జుజశీ=) ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఒక ఖాళీ రైలు భువనేశ్వర్ నుంచి మంచేశ్వర్ వైపు వెళుతుండగా, అదే సమయంలో మరో రైలు దానికి ఎదురుగా అదే ట్రాక్ మీద వస్తోంది. సరిగ్గా ఝార్పడ వంతెన సెక్షన్ వద్ద ఈ రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పైకి వచ్చేశాయి. అయితే, ఈ లోపాన్నిగుర్తించిన రైల్వే సిబ్బంది, లోకో పైలట్లు అత్యంత వేగంగా స్పందించారు. ఎదురెదురుగా వస్తున్న రెండు రైళ్లను చాలా దగ్గరగా సురక్షితంగా నిలిపివేయగలిగారు. ఈ ఘటనతో కాసేపు అక్కడ ఉత్కంఠ, తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటనపై ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రెస్ నోట్ విడుదల చేసింది. షంటింగ్ (షెడ్యూల్డ్ నిర్వహణ.. మరమ్మతులు, క్లీనింగ్) పనుల కోసం ఖాళీ కోచ్‌లను తరలించేటప్పుడు ఈ పొరపాటు జరిగిందని వెల్లడించింది. ఒక ఖాళీ రైలు, అక్కడ అప్పటికే ఆగి ఉన్న మరో ఖాళీ రైలుకు చాలా సమీపంలోకి వచ్చిందని వెల్లడించింది. ప్రమాద సమయంలో రెండు రైళ్లలోనూ ప్రయాణికులు లేరని, ఈ ఘటన ప్రధాన లైన్‌కు దూరంగా జరగడం వల్ల సాధారణ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని తెలిపింది. అలాగే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సదరు ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. ఘటనా స్థలానికి రైల్వే సాంకేతిక బృందం, ఉన్నతాధికారులు తక్షణమే చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సిగ్నలింగ్ లోపమా? కమ్యూనికేషన్ ఫెయిల్యూర్? లేదా సిబ్బంది నిర్వహణ లోపమా? అనే విషయాలపై రైల్వే శాఖ ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ఘటన కచ్చితమైన కారణాలను తెలుసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు స్పష్టం చేశారు

## తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు శాశ్వత భవనాలు

**: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, జూన్ 11:** రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గురువారం నాడు రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఆధునిక సౌకర్యాలతో ఒకే నమూనాలో కార్యాలయాల నిర్మాణం ఉంటుందన్నారు. అద్దె, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలకు శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు చెప్పారు. నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో తుది డిజైన్లకు రూపకల్పన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ూ== పరిధిలో 39



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలో నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని విమర్శించారు. కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలన బలోపేతం చేశామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం క్యూర్ పరిధిలో స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

## గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్నాం..

**: మంత్రి పొన్నం ప్రభాకర్**



**సిద్దిపేట జిల్లా, జూన్11** : రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళు న్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్స్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని.. డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రీయల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోంది..

**మహేశ్ గౌడ్ ధ్వజం**

**ఢిల్లీ, జూన్11:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈరోజు (గురువారం) ఢిల్లీ వేదికగా మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

**రాజకీయ కక్షతోనే ఆ నామినేషన్ తిరస్కరణ..**



దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళా అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని చెప్పుకొచ్చారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

## రైతన్నలారా.. ఇకనైనా మారండి

### రసాయన ఎరువులను వాడకండి...

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**జమ్మికుంట:**జమ్మికుంట కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి రసాయన ఎరువుల ద్వారా పండిస్తున్న పంటలను కొని తినడమంటే పైసలిచ్చి రోగాలను కొని తెచ్చుకోవడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని విడనాడి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటకు మద్దతు ధర రాదనే బాధ అక్కర్లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు కోటీశ్వరులు అయ్యే అవకాశముందన్నారు. కోటి మంది రైతులను







ప్రకృతి వ్యవసాయంవు మళ్లించడమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమన్నారు. మోదీ 4400 రోజుల పాలన పూర్తి నేపథ్యంలో ఆయన స్ఫూర్తితో రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను- మిగతా3లో

## హైదరాబాద్‌కు ఐఐఎం కావాలి..

**కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

**ఢిల్లీ, జూన్11,** : దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ( వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు(గురువారం) ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కుల సర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే..



విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే - మిగతా3లో

## సంపాదకీయం

# టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్క్ బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

# పాకిస్తాన్ కు నీటి కష్టాలు...

**శ్రీనగర్, జూన్ 11:**పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ విషయంలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది. దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. దశాబ్దాల నాటి సిందూ జల ఒప్పందాన్ని హోల్డ్‌లో పెట్టింది. తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. రక్తం నీరు ఏకకాలంలో పారవని స్పష్టం చేసింది. దీంతో సింధూ జలాలు రాక పాకిస్తాన్‌లో కరువు చాయలు, ఆకస్మిక వరదలు వస్తున్నాయి. ఒప్పందం పునరుద్ధరణకు పాకిస్తాన్ అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు.తాజాగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ సింధు జలాల విషయంలో భారత్ కఠిన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింధు నదీ వ్యవస్థ నుంచి పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. 'సింధు జలాల ఒప్పందం రద్దు చేయలేదు. ఇంకా అమలులోనే ఉంది. కానీ తాత్కాలికంగా నిలిపివేశాం. సరిహద్దు గుండా నీళ్లు వెళ్లకుండా ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సీఆర్.పాటిల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు హోం మంత్రి అమిత్



షా ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు1960 సింధు జలాల ఒప్పందం ప్రస్తుతం హోల్డ్‌లో ఉంది. భారత్ ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, పాకిస్తాన్‌కు నీరు అందకుండా చేసేందుకు సాంకేతిక, ఇంజనీరింగ్ చర్యలు తీసుకోవడం ద్వారా ఒప్పంద స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఇటీవలి సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో భారత్ సింధు జలాలను ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. నీటిని భారత్ సొంత అవసరాల కోసం వినియోగించుకోవాలి అన్న ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలను అమలుకు చర్యలు చేపట్టారు.సింధూ జలాలను కేంద్రం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు మళ్లించాలని భావిస్తోంది. దీంతో ఆ రాష్ట్రాలకు అదనపు నీటి వనరులు లభించే అవకాశం ఉంది. శత్రు దేశానికి నీటిని వెళ్లకుండా చేయడమే లక్ష్యంగా ఇప్పటికే సింధూ, దాని ఉప నదులపై బ్యారేజీలు నిర్మిస్తోంది. అధిక వర్షాలు ఉంటే గేట్లు ఎత్తి పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సృష్టిస్తోంది.భారత్--పాకిస్థాన్ మధ్య నీటి వివాదంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఒప్పందం నిలిపివేతను ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా భారత్ తన నీటి సార్వభౌమత్వాన్ని బలపరచుకోవాలని చూస్తోంది. ఈ అంశం రాబోయే రోజుల్లో ద్విపాక్షిక సంబంధాలపై ఎంత ప్రభావం చూపించనుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# జనసేన ప్లానింగ్ ఏంటీ...

**విజయవాడ, జూన్ 11:**ఏపీలో కూటమిగా ఏర్పడిన టిడిపి, జనసేన, బిజెపిలు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఈ క్రమంలో కూటమికి నేతృత్వం వహిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్యేలు ఎలా వ్యవహరిస్తున్నారు ఏం చేస్తున్నారు అనే విషయాలపై తరచుగా నివేదికలు తప్పించుకుంటున్నారు. సర్వేలు కూడా చేయించుకుంటున్నారు. అయితే, మరో కీలక పార్టీగా ఉన్న జనసేన పరిస్థితి ఏంటి అనేది చర్చ నియాంశంగా మారింది.మొత్తం 21 స్థానాల్లో పోటీ చేసిన జనసేన 21 స్థానాల్లో కూడా విజయం దక్కించుకుంది. వీటిలో పిఠాపురం నియోజకవర్గాన్ని పక్కనపెడితే మిగిలిన 20 నియోజకవర్గాల్లో గత రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఏ విధంగా ఉంది.. ఏం చేస్తున్నారు.. అనే అంశాలపై పవన్ కళ్యాణ్ నివేదికలు తెప్పించుకుంటున్నామని చెబుతున్నా.. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా నివేదికలు




సమర్పించలేదని తెలిసింది. ఎప్పటికప్పుడు వాయిదా వేయడంతో పాటు నివేదికలకు ఇచ్చే విషయంలో ఎమ్మెల్యేలు తాత్సారం చేస్తున్నారన్నది పార్టీ వర్గాల్లోనే జరుగుతున్న చర్చ.దీనికి ప్రధాన కారణం నియోజకవర్గాల స్థాయిలో దాదాపు అందరు ఎమ్మెల్యేలు కూడా పై స్థాయిలో చెబుతున్న మాటలను దిశానిర్దేశాన్ని పట్టించుకోకపోవడమే కారణం అని తెలుస్తోంది. వాస్తవానికి జనసేన పార్టీలో నాయకులకు కొన్ని సిద్ధాంతాలు నిబద్ధత ఉండాలనేది పవన్ కళ్యాణ్ చెబుతున్న మాట. ఇటీవల కూడా ఆయన పదేపదే ఈ విషయాన్ని చెప్పారు. తద్వారా ప్రజలకు చేరువ కావాలని కూడా సూచించారు. కానీ, 21 నియోజకవర్గాల్లో దాదాపు 16 నియోజకవర్గాల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నది రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.ఈ నేపథ్యంలో జనసేన అధినేత ఎమ్మెల్యేలను అలర్ట్ చేయడంతో పాటు సరైన దిశలో నడిపించాల్సిన అవసరం కూడా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఎన్నికలకు మూడు సంవత్సరాల సమయం ఉంది కదా అని కూర్చుంటే అప్పటికి పరిస్థితి మరింత విషమించే అవకాశం కూడా ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# మమత ఫెయిల్యూర్ స్టోరీ...

**ఎందుకిలా... ఏమైంది**

**కోల్ కత్తా, జూన్ 11:**మమతా బెనర్జీ 1985లో పార్లమెంట్ సభ్యురాలిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆమె ఒక మంచి పోరాట యోధురాలు, పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్‌ను అధికారం నుంచి విజయవంతంగా గద్దె దింపారు. ఆమె 2011లో ముఖ్యమంత్రి అయ్యారు, 2016లో తిరిగి ఎన్నికయ్యారు, మళ్ళీ 2021లో కూడా గెలిచారు. అయితే, 2026లో ఘోర పరాజయం తర్వాత, ఆమె పార్టీ, ఆమె వ్యక్తిగత రాజకీయ పలుకుబడి వేగంగా క్షీణించే దశలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. నిజాయితీపరుడు, నిష్కపటమైన వ్యక్తిగా భావించే రాజకీయ నాయకులు అధికారాన్ని కోల్పోయినప్పుడు, తరచుగా ప్రజల సానుభూతి ఉంటుంది. కానీ ఒక రాజకీయ నాయకుడు వివాదాల మధ్య ఓడిపోయి, అధికారంలో ఉన్నప్పుడు అహంకారిగా కనిపించినప్పుడు, ప్రతిస్పందన చాలా భిన్నంగా ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రత్యర్థులు ఆ పతనాన్ని వేడుక చేసుకుంటారు. స్నేహితులు కూడా రహస్యంగా దానిని స్వాగతించవచ్చు. ఈ రోజు మమతా బెనర్జీ విషయంలో ఇదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ప్రత్యర్థులు ఆనందంగా ఉన్నారు, ఆమె మాజీ మిత్రులు చాలామంది కూడా, బహిరంగంగా అంగీకరించకపోయినా, సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. బెంగాల్‌లోని చాలా మంది ఓటర్లు ఆమె నాయకత్వంపై విసిగిపోయారనడంలో సందేహం లేదు. వివాదాస్పదంగా, ఘర్షణపూరితంగా, లేదా అవినీతి, హింసతో సంబంధం ఉన్నట్లు కనిపించే రాజకీయ నాయకుల పట్ల ప్రజలు తరచుగా విముఖత చూపుతారు. మమతా బెనర్జీ తరచుగా అటువంటి వివాదాలను ఆకర్షించారు. అయితే, ముఖ్యమంత్రిగా, ప్రజలు ఆమె నుంచి హుందాతనం, సంయమనం, రాజనీతిజ్ఞతను ఆశించారు. చాలా మంది బెంగాలీలు గౌరవం, ప్రజా ప్రవర్తన వంటి విషయాల పట్ల ప్రత్యేకంగా సున్నితంగా ఉంటారు. చివరికి, వారు బ్యాలెట్ పెట్టె వద్ద ఆమెను శిక్షించారు.మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ప్రోత్సహించి ముఖ్యమైన పదవికి ఆయనే వారసుడు అనే వాతావరణాన్ని సృష్టించారు. దీంతో ఆయన షాడో సీఎంగా మారిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అభిషేక్ బెనర్జీ సమర్థవంతమైన నాయకుడిగా, వినయశీలిగా, ప్రభావవంతమైన వ్యక్తిగా భావించి ఉంటే ఈ వాతావరణాన్ని అందరూ స్వాగతించేవారు. అయితే, చాలా మంది ఓటర్లు ఆయనలో ఈ లక్షణాలు లేవని నమ్మారు. ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేయడానికి కేవలం ఒక అవకాశం కోసం ఎదురుచూశారు. జనాభాలో దాదాపు 32% మైనారిటీలు ఉన్న రాష్ట్రంలో, బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నందున, మమతా బెనర్జీ ఓటమి దాదాపు అసాధ్యమని చాలామంది నమ్మారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న నియోజకవర్గాలలో తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం చెలాయించింది. మెజారిటీ తగ్గినా, మమత మళ్లీ గెలుస్తారని చాలా మంది పరిశీలకులు అంచనా వేశారు. దానికి బదులుగా, ఒక నాటకీయ పరిణామం జరిగింది. హిందూ సమాజంలోని ఒక వర్గం ఆమెకు, ఆమె రాజకీయ వైఖరికి వ్యతిరేకంగా మారిందని సమాచారం. ఫలితంగా, బీజేపీ 294 స్థానాలకు గాను 207 స్థానాలను గెలుచుకుని భారీ విజయాన్ని సాధించింది. ఇది




ఒక అద్భుతం.మమతా బెనర్జీ పరిపాలనకు ఎప్పుడూ తగినంత ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించలేదు. ఆమె ప్రభుత్వం రైల్వేలు, విమానాశ్రయాలు, రోడ్లు, కాలువలకు సంబంధించిన అనేక కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ఆలస్యం చేసిందని లేదా అడ్డుకుందని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా, అనేక కేంద్ర ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలు కాలేదు లేదా ఆలస్యమయ్యాయి. ఫలితంగా, పశ్చిమ బెంగాల్ అభివృద్ధి దెబ్బతిందని చాలా మంది భావించారు. కేవలం రాజకీయాలు చాలు అని మమత అనుకుంటే, ప్రజలు మెరుగైన పాలన కోరుకున్నారు. మమతా బెనర్జీ ఓటమికి ఇలా చాలా కారణాలు ఉన్నాయి. కారణాలు ఏవైనప్పటికీ, ఈ ఓటమి నిర్ణయాత్మకమైనది. రాజకీయ పునరాగమనాన్ని అత్యంత కష్టతరం చేస్తుంది. బహుశా మమతా బెనర్జీకి అతిపెద్ద సవాలు బీజేపీ ముఖ్యమంత్రి సువేందు అధికారి. ఆయన ఒకప్పుడు రెండు దశాబ్దాలకుపైగా ఆమెకు సన్నిహితుడు, బలమైన క్షేత్రస్థాయి సంబంధాలున్న రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. అధికారికి బెంగాల్ రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. అనేక విధాలుగా, ఆయనను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో పోల్చవచ్చు. ఆయనకు రాజకీయ చతురత ఉంది. ఇటీవలి నెలల్లో మమతా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ఆమె మద్దతుదారులను పక్షం మార్చుకునేలా ప్రోత్సహించడానికి కృషి చేశారు. పెద్ద సంఖ్యలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆమెకు దూరమయ్యారని సమాచారం. ఇది అసెంబ్లీలో ఆమె స్థానాన్ని చాలా బలహీనపరిచి, పార్టీపై ఆమె అధికారాన్ని తగ్గించింది. ఒకప్పుడు విధేయులైన మద్దతుదారులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు కూడా పార్టీని వీడటం ప్రారంభించారు. ఈ నాయకులలో కొందరు సంవత్సరాల తరబడి మమతా బెనర్జీకి అండగా నిలిచారు, కానీ ఇప్పుడు వేరే రాజకీయ మార్గాలను ఎంచుకున్నారు. పార్టీ నుంచి ముఖ్యమైన రాజకీయ అవకాశాలు పొందిన సుష్మితా దేవ్ నిష్క్రమణ చాలా పెద్ద మార్పు. ఆమె రాజీనామా తృణమూల్ కాంగ్రెస్ నుంచి పెరుగుతున్న వలసలకు ప్రతీకగా నిలిచింది. మమతా బెనర్జీని వీడే ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆమె జెండా కింద ఎన్నికయ్యారు కాబట్టి రాజీనామా చేయాలని చాలా మంది వ్యాఖ్యాతలు వాదిస్తారు. అయితే, ఈ వ్యక్తులు వారి సొంత బలాలు, ప్రజాదరణ కారణంగా ఎంపికయ్యారని కూడా వాదించవచ్చు. ఉదాహరణకు, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు స్వతంత్రంగా ఓట్లను ఆకర్షించగలరనే కారణంతో అభ్యర్థులుగా ఎంపికయ్యారు. అందువల్ల, వారి విజయం కేవలం మమతా బెనర్జీ వల్లే సాధ్యమైందని చెప్పడం పూర్తిగా సరైనది కాదు. 2011 నుంచి, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లోని కాంగ్రెస్, వామపక్ష పార్టీలను క్రమపద్ధతిలో బలహీనపరిచి, వారి రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించారు. అయినప్పటికీ, ఓటమి తర్వాత, ఆమె మద్దతు, రక్షణ కోరుతూ అవే పార్టీల వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. చాలా మంది పరిశీలకులకు, ఇది భయాందోళనను, రాజకీయ విశ్వాసం కోల్పోవడాన్ని సూచించింది. రాజకీయాలు చాలా క్రూరంగా ఉంటాయి. ప్రతీకారం తీర్చుకోవాలనుకునేది శత్రువులు మాత్రమే కాదు. ఒకప్పుడు నిర్లక్ష్యం చేసిన లేదా అవమానాలకు గురైన మాజీ మిత్రులు కూడా పాత లెక్కలు తేల్చుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఓటమి ఒక రాజకీయ నాయకుడిలో భయాందోళన కలిగించకూడదు. అయినప్పటికీ, మమతా బెనర్జీ ఇప్పుడు బలం కన్నా భయంతోనే పనిచేస్తున్నారని చాలామంది నమ్ముతున్నారు. ఆమె ప్రత్యర్థులు ఆమె మద్దతుదారులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుండగా, మాజీ మిత్రులు ఆమె అవమానాన్ని ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తున్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు మెరుగైన సలహాదారులు అవసరమయ్యారు. నేడు, రాజకీయ ప్రతికూలతను ఎదుర్కొంటున్న నాయకురాలిగా, ఆమెకు గతంలో కంటే మెరుగైన సలహాదారులు అవసరమని చెప్పవచ్చు. భవిష్యత్తును అంచనా వేయడం ఎల్లప్పుడూ కష్టం. అయినప్పటికీ, పావెల్ ఫేమస్ కామెట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులను వెంటాడుతూనే ఉంది: "అన్ని రాజకీయ జీవితాలు వైఫల్యంతోనే ముగుస్తాయి." చరిత్రను పరిశీలిస్తే, అత్యంత శక్తివంతమైన రాజకీయ నాయకులు కూడా చివరికి ఓటమిని చవిచూస్తారని తెలుస్తుంది. చాలామంది తమ చివరి కాలంలో రాజకీయ వైభవానికి చాలా దూరంగా ఉంటారు. మమతా బెనర్జీ తన తలరాతను మార్చుకోగలరా లేదా అనేది అనిశ్చితంగానే ఉంది, కానీ ప్రస్తుతం ఆమె రాజకీయ ప్రయాణం అత్యంత క్లిష్టమైన దశలోకి ప్రవేశిస్తున్నట్లు కనిపిస్తోంది.

# గంజాయి క్వీన్ మళ్లీ తప్పించుకుంది...

**హైదరాబాద్, జూన్ 11:**తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూబాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూబాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతంలో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది. గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాంగూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది. ధూల్‌పేట్ నుంచి మకాం మార్చేసి.. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే ప్రాంతంలో తన అడ్డాను ఏర్పాటు చేసుకున్న నీతూబాయి.. కిరాణా షాపు ముసుగులో భారీగా గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ దాడుల్లో గుర్తించారు. నిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన గంజాయి విక్రయాలను నీతూబాయి కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. అయితే నీతూబాయిని గతంలోనే





పోలీసులు అరెస్ట్ చేసి.. ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. జైలుకు వెళ్లి బయటికి వచ్చిన నీతూబాయి.. మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. ఈ డ్రగ్ డాన్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ అన్ని చర్యలు చేపట్టింది. ఒకప్పుడు సాధారణ గృహిణిగా ఉన్న నీతూబాయి స్వస్థలం ధూల్‌పేట్. ఆమె కుటుంబం మొత్తం గుడుంబా దందా చేసేది. అయితే ఆబ్కారీ శాఖ రాష్ట్రంలో గుడుంబా తయారీ, విక్రయాలపై పూర్తిగా నిషేధించడంతో వారు గంజాయి దందా మొదలుపెట్టారు. తమ బంధువులు అంతా ధూల్‌పేటను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తుండగా.. నీతూబాయి మాత్రం నానక్‌రాంగూడలోని లోధా బస్తీకి మకాం మార్చింది. 2023లో నీతూబాయి పోలీసులకు పట్టుబడినప్పుడు గంజాయి అమ్మకాలతో రూ.4 కోట్ల స్థిర, చరాస్తులను కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వాటిని జప్తు చేశారు.

# అమిత్ షా కామెంట్స్ వెనుక కారణం అదేనా..?

**తెలంగాణ, పంజాబ్‌పై ప్రత్యేక వ్యూహం**

**హైదరాబాద్, జూన్ 11:**దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ.. ఉత్తర భారత దేశంలో ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లో పట్టు సాధించింది. ఈశాన్య రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ ఒక్కటే కాంగ్రెస్ చేతిలో ఉంది. తాజాగా బెంగాల్‌లోనూ బీజేపీ పాగా వేసింది. ఇక ఇప్పుడు బీజేపీ దక్షిణాదిపై ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 2028లో జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాజకీయాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇకపై ఏ రాష్ట్రంలోనైనా ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ, పంజాబ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిగా పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే బీజేపీ వ్యూహం రూపొందిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అమిత్‌షా తెలిపారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ రాజకీయ వ్యూహంలో ముఖ్యమైన మలుపును సూచిస్తున్నాయి. గతంలో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పొత్తుల ద్వారా



అడుగుపెట్టిన బీజేపీ, ఇప్పుడు ఒంటరి బలంపై మరింత విశ్వాసం పెంచుకుంది. ఇది పార్టీ తన సొంత ఆధారాలను విస్తరించాలని, స్వతంత్రంగా అధికారం సాధించాలని భావిస్తోందని తెలియజేస్తోంది. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్, ఏఐఎంఐఎం వంటి ప్రాంతీయ పార్టీలు కూడా బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పొత్తులు తిరస్కరించడం రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై కీలక ప్రకటనఅమిత్ షా మరో ముఖ్యమైన విషయం చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేస్తామని. ఇది బీజేపీ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన యూనిఫామ్ సివిల్ కోడ్‌ను దక్షిణాది రాష్ట్రాలకు కూడా విస్తరించాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం ద్వారా పార్టీ తన విజన్‌ను స్పష్టం చేస్తోంది. ఒంటరి పోటీ ప్రకటన తెలంగాణ రాజకీయ దృక్పథాన్ని మార్చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. పొత్తు ఆశల్లో ఉన్న చిన్న పార్టీలకు ఇది ఎదురుదెబ్బ కావచ్చు. బీజేపీ తన సొంత ఓటు బ్యాంకును విస్తరించి, స్వతంత్ర శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలం పెంచుకోవాలన్న బీజేపీ లక్ష్యం స్పష్టమవుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యూహం కావచ్చు. పంజాబ్‌తోపాటు తెలంగాణను కూడా ఒంటరి పోటీ మోడల్‌గా తీసుకురావడం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా తన సానుకూలతను మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అమిత్ షా వ్యాఖ్యలు కేవలం తెలంగాణకు మాత్రమే కాకుండా, బీజేపీ జాతీయ స్థాయి రాజకీయ వ్యూహంలోని ముఖ్యమైన మార్పును తెలియజేస్తున్నాయి. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో అధికారం సాధించాలన్న లక్ష్యం దక్షిణ భారతదేశంలో పార్టీ విస్తరణకు కీలకమవుతుంది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# కాంగ్రెస్ లో విలీనం దిశగా తృణమూల్

**న్యూఢిల్లీ, జూన్ 11:**బీజేపీ నుండి పెరుగుతున్న రాజకీయ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి , ప్రతిపక్షాలను బలోపేతం చేయడానికి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని సోనియా గాంధీ ప్రతిపాదించారు. పార్టీలో అంతర్గత విభేదాలు, ప్రముఖ నాయకుల నిష్క్రమణలు వంటి సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రతిపాదనపై వెంటనే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, ఆలోచించుకోవడానికి మమతా బెనర్జీ కొంత సమయం కోరినట్లు సమాచారం. ఈ విలీన ప్రక్రియ కోసం కాంగ్రెస్ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని, అలాగే టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీలో ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనల గురించి ఇరు పార్టీల నుండి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ధృవీకరణ వెలువడలేదు. రాజకీయ ఉత్కంఠను రేపుతున్న ఈ పరిణామాల మధ్య, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. గంటన్నరకు పైగా సాగిన ఈ చర్చలు చాలా ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని అభిషేక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ముగిసిన ఎన్నికల అనంతర పరిస్థితులపై, ప్రస్తుత రాజకీయాలపై



ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం

**పెరుగుతున్న అసమ్మతి నేతలు**

తృణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. ఆ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ఇండియా కూటమి సమావేశానికి ఢిల్లీ వెళ్లి వెళ్లగానే.. కలకత్తాలో తిరుగుబాటు బావుటా ఎగిరింది. ఏకంగా 20 మంది ఎంపీలు, తాము ఎన్డీయేలో చేరేందుకు అనుమతి కావాలంటూ స్పీకర్ ఓం బిర్లాకి లేఖ రాయడం కలకలం రేగింది. అయితే.. తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. యూసుఫ్ పఠాన్, సయోని ఘోష్, శత్రుఘ్న సిన్హా వంటి ప్రముఖులతో సహా దాదాపు 19 మంది ఎంపీలు తిరుగుబాటుదారుల జాబితాపై సంతకాలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనితో పార్టీ నిలువునా చీలిపోయే దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నీ దీదీకి సవాల్ గా నిలుస్తున్నాయి. బసిర్‌హత్ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాం మరణంతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, ప్రస్తుతం లోక్‌సభలో టీఎంసీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. అయితే, తాజా తిరుగుబాటు కారణంగా సభలో మమతా బెనర్జీకి ఉన్న వాస్తవ మద్దతు బలం కేవలం 19 మంది ఎంపీలకు తగ్గిపోయింది. తక్షణమే రాజీనామా చేయకూడదని లేదా అధికారికంగా దీదీలో చేరకూడదని అసమ్మతి ఎంపీలు నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాల సమాచారం. దానికి బదులుగా, వారు ఎన్డీఏకి మద్దతునిస్తూ ఒక ప్రత్యేక వర్గంగా కొనసాగాలని యోచిస్తున్నారు; ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తిరుగుబాటు వర్గానికి నాయకత్వం వహిస్తున్నట్లు భావిస్తున్న కాకోలి ఘోష్ దస్తీదార్, ఎన్డీయే కు మద్దతు ప్రకటిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తామని చెప్పారు. కనీసం 20 మంది టీఎంసీ (ఏపీజ) ఎంపీలు స్పీకర్‌కు అధికారిక లేఖ సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. లోక్‌సభలో టీఎంసీ ఛీఫ్ విప్‌గా దస్తిదార్ కొనసాగుతున్నారని స్పీకర్ ముందు వాదించే అవకాశం ఉందని అసమ్మతి వర్గం భావిస్తున్నట్లు సమాచారం; పార్లమెంటులో తలెత్తే అవకాశం ఉన్న న్యాయపరమైన మరియు విధానపరమైన పోరాటంలో ఈ వాదన కీలక అంశంగా మారవచ్చు.

# వడివడిగా ఫ్యూచర్ సిటీ అడుగులు...

**హైదరాబాద్, జూన్ 11:**తెలంగాణ రాజధాని హైదరాబాద్ భౌగోళిక, ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో ఒక చారిత్రాత్మక మైలురాయి ఆవిష్కృతం కాబోతోంది. ఈ మెగా గ్రీన్‌ఫీల్డ్ నగర అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ శాశ్వత కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో నిర్మించిన ఈ అత్యాధునిక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా ప్రారంభించి, ఇక్కడి నుంచే ఫ్యూచర్ సిటీ పనుల వేగాన్ని పరుగులు పెట్టించబోతున్నారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవ వేదికగానే తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టే ఒక అంతర్జాతీయ స్థాయి కీలక ఒప్పందం కూడా జరిగింది. దాదాపు 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ నయా నగరానికి సంబంధించి వరల్డ్-క్లాస్ సమగ్ర మాస్టర్ ప్లాన్ ను రూపొందించే బాధ్యతను సింగపూర్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ డిపి ఆర్కిటెక్ట్స్ కు ప్రభుత్వం అప్పగించింది. గ్లోబల్ టెండర్లలో పాల్గొన్న ఆరు దిగ్గజ సంస్థల్లో అత్యంత తక్కువ బిడ్ తో నిలిచిన ఈ సింగపూర్ సంస్థకు, వేదికపైనే సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా 'వర్క్ ఆర్డర్' లేఖను అందజేశారు. రాబోయే తొమ్మిది నెలల కాలంలో ఈ గ్లోబల్ కన్సల్టెంట్ ఫ్యూచర్ సిటీ సమగ్ర బ్లూప్రింట్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ జోన్ డెవలప్ మెంట్ పరిధిలో మొదటి విడతగా దాదాపు 30,000 ఎకరాల ప్రధాన జోన్‌పై అధికారులు దృష్టి సారించారు. ఇందులో దాదాపు 13,000 ఎకరాలను 'ప్రయారిటీ డెవలప్‌మెంట్ జోన్' గా గుర్తించి, వివిధ రంగాలకు చెందిన గ్లోబల్ క్లస్టర్లను ఇక్కడ విభజించారు. కొత్త ఆఫీస్ కేంద్రంగానే వీటికి సంబంధించిన పనులు సాగనున్నాయి. ఈ ప్రణాళిక ప్రకారం.. ఫ్యూచర్ సిటీలో 4,000 ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్, 403 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , 2,177 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ డ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్, 1,976 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికల్ పార్క్, 313 ఎకరాల్లో గ్లోబల్ డేటా సెంటర్ హబ్, 594 ఎకరాల్లో హెల్త్ సిటీ, 255 ఎకరాల్లో ఎడ్యుకేషన్ జోన్ , 2,477 ఎకరాల్లో అత్యాధునిక రెసిడెన్షియల్ జోన్‌లను నిర్మించబోతున్నారు. నగరంలో అస్తవ్యస్తంగా పెరుగుతున్న అర్బనైజేషన్ ఒత్తిడిని తగ్గించేందుకు, ఈ ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా, భారతదేశంలోనే మొట్టమొదటి 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా దాదాపు 15,000 ఎకరాల అటవీ ప్రాంతాన్ని సహజసిద్ధంగా కాపాడుకుంటూనే ఇకో-టూరిజం జోన్లను డిజైన్ చేస్తున్నారు. కాలుష్య రహిత సూత్రాల ఆధారంగా డాక్టర్ రెండీస్, భారత్ బయోటెక్, హెటెరో, ఎంఎస్ఎన్, అరబిందో వంటి ప్రముఖ ఫార్మా దిగ్గజాలు ఇక్కడ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాయి. వీటికి తోడు అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్ వంటి అంతర్జాతీయ సంస్థల మెగా డేటా సెంటర్లు, ఇప్పటికే పనులు ప్రారంభించుకున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' శాశ్వత క్యాంపస్, దాదాపు 50 ఎకరాల్లో నిర్మించబోయే లెదర్ ఇండస్ట్రీ స్కిల్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కొత్త క్యాంపస్ పనులను కూడా ఈ కొత్త అథారిటీ కార్యాలయం నుంచే వేగవంతం చేయనున్నారు.

## నామినేటెడ్ రెన్యువల్స్ కష్టమే...

- మొదటి పేజీ తరువాయి

పని తీరుపై సీఎం రేవంత్ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ చాలా మంది పని తీరు మెరుగు పరుచుకోలేదన్న అభిప్రాయం ఉంది. పైగా వాళ్ళు ఎవరూ పార్టీ కోసం సరిగా సమయం ఇవ్వడం లేదన్న నివేదికలు సైతం సీఎం దగ్గర ఉన్నాయట. రెన్యువల్ అయ్యే వాళ్ళ సంఖ్య చాలా తక్కువ అనే భావన కూడా ఉంది. ఐతే ఇటీవల టీశాట్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ పదవుల్ని రెన్యువల్ చేసింది ప్రభుత్వం. దీంతో... మిగతా వాళ్ళలో కొందరు ...మా పదవులు మాత్రం ఎందుకు రెన్యువల్ కావన్న ధీమాతో ఉన్నట్టు తెలుస్తోంది. మరికొందరైతే... టెన్షన్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఏ లెక్కన చూసుకున్నా... ఇప్పుడున్న 37మందిలో మెజార్టీ నాయకులకైతే రెన్యువల్ ఉండకపోవచ్చనే తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని టీజీఐఐసీ ఛైర్మన్‌గా కొనసాగించే అవకాశం ఉంది. అలాగే....స్పోర్ట్స్ అథారిటీ,ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ ఛైర్మన్ లాంటి కొన్ని పదవులకు మాత్రం రెన్యువల్స్ ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వాళ్ళలో 16 మందికి ఇంటెలిజెన్స్ అధికారుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయని, సదరు ఛైర్మన్స్ రెజుమేస్‌ను తిరిగి అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. రేవంత్ సీఎం అయినప్పటి నుండి.. పదవులు ఇచ్చే ప్రతిఒక్కరి విషయంలో పోలీసు విచారణ చేయిస్తున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు కూడా అదే పంథా ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. కొందరు కార్పొరేషన్ ఛైర్మన్ ల మీద ఆరోపణలు వచ్చిన క్రమంలో ఫ్రెష్ గా నివేదిక కోరినట్టు తెలుస్తోంది. ఏదేమైనా రెన్యువల్ కి సమయం దగ్గర పడుతుండటంతో చాలా మందిలో ఐతే టెన్షన్ మొదలైందని అంటున్నారు. మళ్ళీ ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ.. నేతల వద్దకు క్యూ కడుతున్నారు. వీరికి తోడు.. కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు కూడా ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారు.

## అడగుంటున్న భూగర్భ జలాలు..

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర మొత్తం భూగర్భ జల వనరుల్లో కేవలం 3 శాతం మాత్రమే లభ్యత ఉండటం గమనార్హం. జనాభా సాంద్రతకు, నీటి లభ్యతకు మధ్య ఉన్న ఈ తేడా నగర జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. కేంద్ర నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున 19.8 లక్షల హెక్టార్ మీటర్ల మేర భూగర్భ జల వనరులు ఉన్నాయి. అయితే.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి వచ్చే గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌కు మాత్రం కేవలం 66 వేల హెక్టార్ మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల సగటును పరిశీలిస్తే.. ప్రతి జిల్లాకు దాదాపు 63 వేల హెక్టార్ మీటర్ల భూగర్భ జలాలు లభిస్తున్నాయి. జనాభా పరంగా ఎంతో చిన్నవైన ఆసిఫాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలు కూడా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం వనరులతో సమానమైన భూగర్భ జల సంపదను కలిగి ఉండటం, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది. ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి లభించే భూగర్భ జలం కేవలం 6,100 హెక్టార్ మీటర్లు మాత్రమే కాగా.. 40 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా తమ గృహ, వాణిజ్య అవసరాల కోసం 2025 సంవత్సరంలోనే అందులోని దాదాపు 99 శాతం నీటిని పూర్తిగా తోడేశారు. దీనివల్ల భూగర్భ జలాలు సహజసిద్ధంగా రీఛార్జ్ అవ్వడానికి అసలు అవకాశమే లేకుండా పోయింది. ఇదే విధమైన ధోరణి పక్కనే ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ కనిపిస్తోంది. అక్కడ లభ్యమయ్యే 9700 హెక్టార్ మీటర్ల జలాల్లో ఇప్పటికే 7700 హెక్టార్ మీటర్ల నీటిని తోడేయడంతో ఆ ప్రాంతం కూడా ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉంది. మహానగరం కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడం, వర్షపు నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే పనితీరు బాగున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో అత్యధిక శాతం భూమి కాంక్రీట్, రోడ్లతో నిండిపోవడం వల్ల వర్షం పడినా నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనికి తోడు హైదరాబాద్‌లోని రాతి భూగర్భ పొరలు, తగ్గిపోతున్న ఖాళీ స్థలాలు సహజ రీఛార్జ్ ప్రక్రియను పూర్తిగా దెబ్బతీశాయని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరవాసులు, ప్రభుత్వం అప్రమత్తమై ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని ఆయన హెచ్చరించారు.

## రైతన్నలారా.. ఇకనైనా మారండి

- మొదటి పేజీ తరువాయి

పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని క్రుషి విజార్ఞున కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రు నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, కేవీకే వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్టు వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా నాయకులు మహిపాల్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ ను,ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. భూమి పూజ చేశారు. మొక్క నాటారు. ప్రక్రుతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రుతి వ్యవసాయాన్ని పెంపొందించేందరుకు క్రుషి విజార్ఞున కేంద్రం చేస్తున్న క్రుషిపై ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్ ప్రసంగించారు. ముఖ్యాంశాలు:గోమాత, భూమాత, భరతమాత నినాదంతో మూడేళ్లపాటు 6 వేల 18 మంది రైతులతో 19 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, రాబోయే రోజుల్లో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్న జమ్మికుంట క్రుషి విజార్ఞున కేంద్రం నిర్వాహకులను,సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఈ దేశంలో కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లిస్తానని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు స్పూర్తితో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాబోయే రెండేళ్లలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయం వైపు మళ్లిస్తా. జమ్మికుంట కేవీకే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.రసాయన ఎరువులతో వ్యవసాయం చేస్తూ అధిక పంట పండిస్తూ,రోగాలు కొని తెచ్చుకుంటున్నాం. ఉజ్బెకిస్తాన్ వంటి దేశం రసాయనాలు వాడటంవల్ల సర్వనాశనమైంది. దేశానికి అన్నపూర్ణగా విలసిల్లిన పంజాబ్ లో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ కావడంవల్ల క్యాన్సర్ రోగులు ఎక్కువయ్యారు. క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక ట్రైన్ వెళుతున్న ద్రుశ్యాలు అత్యంత బాధాకరం.

## హైదరాబాద్‌కు ఐఐఎం కావాలి..

- మొదటి పేజీ తరువాయి

ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. కులాల మధ్య గోడలు కూల్చేందుకే ప్రతి నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాల భాగస్వామ్యంగా ఉన్నాయని వెల్లడించారు. టాటా గ్రూప్ రూ.2,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'తెలంగాణ రైజింగ్' విజన్- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం (××వీ) రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలు.. హైదరాబాద్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు తొలి విజయమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ 6 ప్రధాన నగరాల మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధి ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రో ఫేజ్-2, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

వార్తాతరంగాలు

శుక్రవారం 12 జూన్ 2026

# కోలివింగ్ హాస్టల్స్ లో ఏం జరుగుతోంది...



హైదరాబాద్, జూన్ 11:హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్ధలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు.కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలంటే.. ఒక హై లెవల్ కమిటీ ద్వారా సమగ్రంగా విచారణ చేయించి.. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో వీహెచ్ చేసిన సూచనపై ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నెటిజన్లు సూచిస్తున్నారు.ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఓ కో లివింగ్ హాస్టల్‌పై నుంచి ఒక యువతి దూకి ప్రాణాలు తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రియుడి వేధింపులను తట్టుకోలని ప్రియురాలు.. అదే కో లివింగ్ హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కూడా గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండే యువతీయువకులు చేసే పనులతో పరిసరాల్లో ఉండే నగరవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ఆవిష్కరణ

పాల్గోన్న కవిత



హైదరాబాద్:బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అవిష్కరించారు.కవిత మాట్లాడుతూ జులై 2న ఉప్పల్ భగాయత్ భూములు స్వాధీనం చేసుకుంటాం. ఉద్యమకారుల భూపోరాటానికి అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలి. జులై 2న ఉప్పల్ భగాయత్ లో భూపోరాటం చేసి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామని అన్నారు.ఉద్యమకారులకు 250 గజాల భూమి ఇచ్చే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వెంటనే ఉద్యమకారులను గుర్తించి వారికి ఇస్తామన్న భూమి ఇవ్వాల్సిందే. మరో మారు కొంతమంది వ్యక్తులు, శక్తులు తెలంగాణవాదం మీద దాడి చేస్తూ తెలంగాణ స్ఫూర్తిని దెబ్బ తీసే కుట్ర చేస్తున్నారు. అందుకే వాళ్ల కుట్రలను తిప్పికొట్టేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం మనందరి చారిత్రక కర్తవ్యం. ఉద్యమకారులకు మంచి జరగాలని భావించే వాళ్లంతా పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నా. ముఖ్యంగా యువత, మహిళలు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొనాలి. మీ భవిష్యత్ కోసం ఉద్యమకారులు వాళ్ల జీవితాలనే త్యాగం చేశారు. కనుక వారికి మంచి చేసే కార్యక్రమంలో మనమంతా పాల్గొనాలని అన్నారు.

## ఎస్ఎల్బీసీ కాలువ పనులను పరిశీలించిన మంత్రి కొమటిరెడ్డి



నల్గొండ:నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎస్ఎల్బీసీ (ఞాదీజ) కాలువ లైనింగ్ పనులను ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువ ఆధునీకరణ ద్వారా సాగునీటి పంపిణీ మరింత సమర్థవంతంగా జరిగి, మన రైతు సోదరులకు అధిక ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయ రంగాభివృద్ధి, నీటి వనరుల సమర్థ వినియోగమే ధ్యేయంగా మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## రేవంత్ అనుచరుడే వెన్నుపోటు పొడిచాడు

హరీష్ రావు



హైదరాబాద్:రేవంత్ రెడ్డికి దగ్గర వ్యక్తికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వనందుకే మీనాక్షి నటరాజన్ కేసు విషయాన్ని బయటకు లీక్ చేశారని మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురి కావడానికి తెలంగాణ కాంగ్రెస్ నాయకులే అని మధ్యప్రదేశ్ మంత్రి అంటున్నాడు. రేవంత్ రెడ్డికి దగ్గరగా ఉండే వ్యక్తే మీనాక్షి నటరాజన్కు వెన్నుపోటు పొడిచారని మాకు సమాచారం వచ్చింది. అతనికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని రేవంత్ రెడ్డి మీనాక్షి నటరాజన్ను అడిగితే, ఆమె ఒప్పుకోలేదని వెన్నుపోటు పొడిచారని సమాచారం ఉందని అన్నారు.రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జే వెన్నుపోటు పొడిస్తే, సామాన్యుల పరిస్థితి ఏంటి. దీనిపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని అయన అన్నారు.

# బండికి బ్రేకులు..



కరీంనగర్, జూన్ 11:గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? ఈసారి ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదా? గత ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్స్ గెలుపులో కీలకంగా వ్యవహరించారని పేరున్న బండి ఇప్పుడెందుకు దూరం అవుతారు? పార్టీలో అసలా చర్చ ఎందుకు జరుగుతోంది? అది బండి వ్యక్తిగతమా లేక పార్టీ నిర్ణయమా? తెలంగాణలో పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్స్‌కు, గత ఎన్నికల టైంలో వివిధ కారణాలతో ఆగిన మరికొన్ని మున్సిపాలిటీలకు త్వరలోనే ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఆ దిశగా కమలం పార్టీ కూడా గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్‌లు, వరంగల్ , ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. గత ఎన్నికలలో బీజేపీ గ్రేటర్ పరిధిలో, వరంగల్ లో చెప్పుకోతగ్గ సీట్లే గెలుచుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎవరూ ఊహించనన్ని సీట్లు సాధించింది. అప్పట్లో పార్టీ ఆ స్థాయిలో పనితీరు కనబరచడానికి కారణం నాడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేసిన ప్రచారం ఆయన ప్రసంగాలేనన్న అభిప్రాయం స్థానిక కేడర్‌లో ఉంది. బండి పార్టీలో జోష్ తీసుకురావడంతోపాటు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించగలిగారన్నది వాళ్ల మాట. ఆ తర్వాత జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ మంచి పెర్ఫార్మెన్స్ చూపించింది. అది కూడా బండి సంజయ్ వల్లనే అనే మాట పార్టీలో ఉంది. మళ్ళీ ఇప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో బండి సంజయ్ రోల్ ఏంటన్న చర్చ మొదలైంది. ఆ మధ్య జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను గెల్చుకుంది బీజేపీ. నెక్స్ట్ మా టార్గెట్ జీహెచ్ఎంసీ అని అప్పుడే అన్నారు బండి సంజయ్. కానీ... ఇప్పుడు మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆయన ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.గత ఎన్నికల టైమ్‌లో బండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు కాబట్టి... అంతటా తిరిగే అవకాశం ఉండేది. కానీ... ఇప్పుడు ఆ ఛాన్స్‌లేదు. పైగా గ్రేటర్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు ఈ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కలన్నిటినీ చూసుకుంటే....ఈసారి బండి సంజయ్ ఇక్కడ ప్రచారం చేయకపోవచ్చన్న అంచనాలున్నాయి. అలాగే ఇక్కడి నేతలు కొందరికి, ఆయనకు మధ్య గ్యాప్ కూడా ఉందని చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల కారణాలతో బండి సంజయ్ కూడా వ్యక్తిగతంగా గ్రేటర్‌లో ప్రచారంపై ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అయితే హైదరాబాద్‌ని వదిలేసినా వరంగల్‌లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలకు కూడా ఇదే విషయం చెప్పినట్టు తెలిసింది. వరంగల్ ఇన్చార్జ్‌గా తీసుకొని పని చేస్తే తృప్తి అయినా ఉంటుందని కేంద్ర మంత్రి భావిస్తున్నట్టు సమాచారం. దీంతో పార్టీ పెద్దలు ఆయనకు ఎక్కడ బాధ్యతలు అప్పగిస్తారోనని ఆసక్తిగా చూస్తోంది కేడర్.

# యాక్టివ్ పాలిటిక్స్ కు మల్లారెడ్డి దూరం..?

రంగారెడ్డి, జూన్ 11:తెలంగాణ రాజకీయా ల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న మాజీ మంత్రి, మేడ్చ ల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి (బి ఆర్ ఎస్) ఎన్నికల్లో పో టీ చేయవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బి ఆర్ ఎస్ అ ధిష్టానం టికెట్ ఇస్తే తన పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డిని బరిలోకి దింపాలని భావిస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి బిజెపిలో చేరుతారని ఇటీవల సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.ఎంపీ తో పాటు 5 ఎమ్మెల్యే టికెట్లు ఆయన కుటుంబ సభ్యులకు ఇవ్వాలని బిజెపి అధిష్టానాన్ని అడుగుతున్నారని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో అనుచరులు కొందరు నేరుగా మల్లారెడ్డిని ఈ విషయమై అడిగారు. తాను పోటీ చేయబోనని, టిఆర్ఎస్ టికెట్ ఇస్తే మహేందర్ రెడ్డి పోటీ చేస్తారని చెప్పారు.అంతేగాక చిన్న కుమారుడు భ ద్రారెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతారని సూటిగా చెప్పకుండా చేరుతారేమోనని అన్నారు. బిజెపిలో చేరబోనని, బి ఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పారు. మల్లారెడ్డి కోడలు ప్రీతి రె డ్డికి రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఆమె బిజెపిలో చేరుతారని పార్లమెంటుకు పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మూడు చోట్ల ఇటీవల బి ఆర్ ఎస్ సభ్యత్వ నమోదు, సర్ పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడ్చల్, ఘట్కేసర్ తో పాటు మరోచోట సమావేశాలు జరిగాయి. వీటికి సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానికంగా ఉన్నప్ప టికీ సమావేశాలకు హాజరు కాలేదు. పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా హాజరయ్యారు. స్థానికంగా ఉండి సమావేశాలకు హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. బిజెపిలోకి వెళ్తున్నందున సమావేశాలకు హాజరు కాలేదని ప్రచారం జరిగింది. మల్లారెడ్డి తీరుపై బీఆర్ఎస్ అధిష్టానం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. టిఆర్ఎస్ లో ఉంటూనే కాంగ్రెస్ బిజెపి నేతలను కలిశారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ప్రధాని మోడీని వేసి ఆహ్వానించారు.పార్టీకి సమాచారం లేకుండా కలవడంపై అధిష్టా నం గుర్రుగా ఉంది. బి ఆర్ ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం లో ఈ విషయమై కెసిఆర్ మల్లారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీకి సమాచారం ఇవ్వకుండా సీఎంను కలవడంతో బిఆర్ఎస్కు చెందిన ముఖ్య నాయకులు వివాహ వార్షికోత్సవానికి గైరహాజరయ్యారు. కాంగ్రెస్కు చెందిన డి ప్యూటీ సీఎం, పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ విషయమే అప్పట్లో పెద్ద చర్చ జరిగింది.



మల్లారెడ్డి నిర్ణయం వ్యూహాత్మకమా లేక నిజంగానే పోటీ చేయరా అనేది చర్చనీ అంశమైంది. వాస్తవానికి మల్లారెడ్డి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఇంకో టర్మ్ పోటీ చేయగలరు. ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో అనుచరులకు అర్థం కా వడం లేదు. ఆరు నెలల క్రితం తాను పోటీ చేయను అని అ న్నారు. ఆ తర్వాత మళ్లీ నేను అలా అనలేదు అంటూ మాట మార్చారు. ఇప్పుడు కూడా మాట మార్చేస్తారా? నిజంగానే పోటీకి దూరంగా ఉంటారో వేచి చూడాల్సిందే!

# దడ పుట్టించిన తొలి వర్షం..



హైదరాబాద్, జూన్ 11:హైదరాబాద్ నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన భాగ్యనగరానికి తొలకరి పలకరింపు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని భావించినప్పటికీ.. ఈ వాన మాత్రం సున్నితంగా, ఆనందంగా డాన్సులు వేసేలా లేదు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఉగ్రరూపం దాల్చి నగరవాసులను ఒక్కసారిగా దడదడలాడించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా అంధకారమయమై, ఒక భారీ ఉరుముల, మెరుపుల వర్షం నగరంలోకి ప్రవేశించడంతో వాతావరణం క్షణాల్లో మారిపోయింది.వాతావరణ పరిశీలకుల హెచ్చరికల ప్రకారం.. అమీన్‌పూర్, పటాన్‌చెరు, బాచుపల్లి మీదుగా అంచెలంచెలుగా విస్తరించిన ఈ భారీ మేఘాల గుంపు, గంటల వ్యవధిలోనే హైదరాబాద్ మహా నగరాన్ని పూర్తిగా చుట్టేసింది. పశ్చిమ, మధ్య హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌తో పాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉరుముల గర్జనలతో కూడిన కుండపోత వాన కురిసింది. కేవలం గంట వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 40 మి.మీ నుండి 50 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావడంతో.. నగర రహదారులు చూస్తుండగానే చెరువులను తలపించాయి. కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమైన వేలాది మంది ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఈ ఆకస్మిక వాన దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి రద్దీ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీరు, లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన రహదారుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వానకు తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం సమస్య తీవ్రతను మరింత పెంచిందినగరంలో తలెత్తిన ఈ ట్రాఫిక్ గందరగోళాన్ని చక్కదిద్దడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. వాహనదారులకు సోషల్ మీడియా ద్వారా నిరంతరం అలర్ట్‌లు జారీ చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ నగరవాసులకు కొన్ని కీలక సూచనలు చేసింది. వర్షం పడుతున్న సమయంలో రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున వాహనాల వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలి. ముఖ్యంగా బైక్ నడిపేవారు ఓవర్ టేక్‌లు చేయవద్దని, భారీ ఈదురుగాలులు వీస్తున్నందున చెట్ల కింద, పాత గోడల పక్కన వాహనాలను ఆపకూడదు అని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలపడనున్నందున ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

## కారు, లారీ ఢీ.. ఒకరికి గాయాలు

వికారాబాద్:వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది.వేగంగా వెళ్తున్న కారు లారీ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు ముందు భాగంతో పాటు డివైడర్ గ్రిల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముందు వెళ్తున్న బైకును తప్పించబోయిన కారు అదుపు తప్పి పక్కనే వస్తున్న లారీని బలంగా ఢీకొట్టి, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్పైకి దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. కారు యజమాని-టీచర్ శాంత కుమార్ స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డాడు.ప్రమాదం జరగగానే లారీ డ్రైవర్ లారీ వదిలి పరారయ్యాడు.

## మజిల్స్ పెంచే ఇంజక్షన్ స్వాధీనం

వరంగల్:వరంగల్ చారబౌలిలో కండలు పెంచే ఇంజక్షన్లు విక్రయిస్తున్న మహ్మద్ అబ్దుల్ సోహెబ్ ను డ్రగ్ కంట్రోల్ అధికారులు అదుపులోకి తీసుకున్ఆరు. నిందతుడినుంచి 30 ఇంజెక్షన్ల (రూ.15,827)ను స్వాధీనం చేసుకున్నారు. ఆన్లైన్లో తెప్పించి యువకులకు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసారు.

## రోడ్డు విస్తారణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్:హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మితమవుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి వాటి స్థానం లో నిర్మిస్తున్న విద్యుత్ టవర్స్ పనులను పరిశీలించి విద్యుత్ తీగల స్తంభాల తొలగింపు పై సిబ్బంది తో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.తరువాత రహదారి విస్తరణ లో భాగంగా కొండాపూర్ గ్రామ శివారుల్లో నిర్మితమవుతున్న కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు విస్తరణ లో పెండింగ్ లో ఉన్న కల్వర్టులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్యాకేజీ 1,2 కింద 163.20 కోట్లు మంజూరు చేసింది .కొత్తపల్లి నుండి సందరగిరి 10 కిమీ రోడ్డు విస్తరణకు ప్యాకేజీ - 1 కింద 86 కోట్లు మంజూరు చేసింది. సుదరగిరి నుండి హుస్నాబాద్ కి ప్యాకేజీ 2 కింద 77.20 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

## తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్:తెలంగాణలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. మొదటి సంవత్సరంలో 68.84 శాతం, రెండవ సంవత్సరంలో 49.29 శాతం ఉత్తీర్ణత నమోదయింది. సప్లిమెంటరీ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం మొదటి సంవత్సరంలో 76.10.. రెండవ సంవత్సరంలో 52.56 శాతం, బాలుర ఉత్తీర్ణత శాతం మొదటి సంవత్సరంలో 62.57.. రెండవ సంవత్సరంలో 47.45 శాతం వుంది.

# గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి..

**నిధులను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జోగులాంబ గద్వాల, జూన్ 11(స్కై న్యూస్):** గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుంటే వివిధ నిధులను సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను 16వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగంకు రూపొందించాల్సిన జిపిడిపి (గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్), బీపీడీపీ (బ్లాక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్), డిపిడిపి (డిస్టిక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్)పై జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు నిర్వహించిన వర్క్ షాప్ లో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. గ్రామపంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా వచ్చే జనరల్ ఫండ్ తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, దాతల విరాళాలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళిక రూపొందించుకుంటేనే ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గ్రామస్థాయిలో పనిచేసే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర



జిపిడిపి రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సబ్ కి యోజన, సబ్కా వికాస్ సైట్ లో జిపిడిపి వివరాలను ఈనెల 30వ తేదీలోగా అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. వివిధ జాతీయ పంచాయతీ అవార్డులను పొందేలా గ్రామపంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసుకునేందుకు జిపిడిపి దోహదపడుతుందన్నారు. ఇటీవల జిల్లాలోని కొన్ని గ్రామపంచాయతీలు జాతీయ పురస్కారాలు పొందేందుకు నిర్దేశిత సూచీలో 90 మార్కులు సాధించి నామినేట్ కావడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి లైన్



డిపార్ట్మెంట్ అధికారులు జిపిడిపిల రూపకల్పనలో ఎంపీడీవోల సహకారం తీసుకోవాలని, వారి మార్గదర్శకత్వంలో ముందుకెళ్లాలన్నారు. అధికారుల అలసత్వంతో నిధులు వెనక్కి వెళితే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ వర్క్ షాప్ లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత శాఖ ఏడిని కలిసిన డీకే స్నిగ్ధ రెడ్డి

**చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఏడి ఇందిరా........**

**చేనేత కార్మికుల సంక్షేమంపై బీజేపీ నేతల చర్చ**

**జోగులాంబ గద్వాల, జూన్ 11(స్కై న్యూస్):** జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు (ఏడి) ఇందిర ను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి ఎగ్బోటీ రవికుమార్ తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ గద్వాల జిల్లాలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి అర్హుడైన కార్మికుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే చేనేత ఎన్నికల అంశాలతో పాటు సంఘాల వ్యవహారాలు, కార్మికులకు అందాల్సిన సమాచారం గురించి ఏడి ఇందిరాతో చర్చించారు. చేనేత కార్మికులకు సంబంధించిన ఏ సమాచారం అయినా మధ్యవర్తుల ద్వారా కాకుండా అధికారికంగా ప్రెస్ నోట్ల ద్వారా తెలియజేస్తే జిల్లాలోని ప్రతి కార్మికుడికి అవగాహన కలుగుతుందని స్నిగ్ధ రెడ్డి ఏడికి సూచించారు. అలాగే చేనేత కార్మికులకు పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన చేనేత గుర్తింపు కార్డులు అర్హులైన వారికి త్వరగా అందేలా చూడాలని కోరారు. దీనిపై ఏడి ఇందిర స్పందిస్తూ చేనేత కార్మికుల సంక్షేమానికి తమశాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గుర్తింపు కార్డుల కోసం కార్మికులు దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారని, అనంతరం అర్హులకు కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నిజమైన చేనేత కార్మికులకే అందేలా చూస్తామని,




ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీమన్నారాయణ, బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

**హామీలతో కాలయాపన తగదు**

**నాగర్ కర్నూల్ జూన్ 11( స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడకుండా అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు జిల్లా ప్రధాన కార్యదర్శి దేశామోని ఆంజనేయులు డిమాండ్ చేశారు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యను అభ్యసించే పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని ఒకవైపు ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తామని ప్రకటిస్తూనే ఉన్న ప్రభుత్వ పాఠశాలను మూసివేయడం దారుణమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి




రేవంత్ రెడ్డి సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చకపోవడం విడ్డూరంగా ఉందని నిరుద్యోగ భృతి చెల్లించడంలో వైఫల్యం చెందుతుందన్నారు సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రభుత్వం శాఖలలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటి వల్ల ప్రభుత్వ పథకాలు కూడా అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదని అన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖలో సుమారు 12000 పోస్టులు వైద్య ఆరోగ్యశాఖలో 10,000 పోస్టులకు పైగా ఖాళీలు ఉన్నాయని గ్రామ పాలన మరియు రెవెన్యూ శాఖలో 10954 మహిళా శిశు సంక్షేమ శాఖలో 14236 అంగన్వాడి మరియు టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని అదేవిధంగా ఇరిగేషన్ పంచాయతీరాజ్ శాఖలో పాటు ఆర్టీసీలో దేవాదాయ శాఖలో ఖాళీలు ఉన్నాయని వాటిని త్వరితగతన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల ఖాళీలను భర్తీ చేయవలసిన అధికారులు వాటి వివరాలను గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు వెంటనే రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థులకు చెల్లించవలసిన బకాయిలను దృష్టిలో ఉంచుకొని ఎనిమిది వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు రామస్వామి బాలపిరు రామకృష్ణ రాజు శ్రీనివాసులు నరేష్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు

## రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలి...



**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కై న్యూస్)** రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలని లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ నాగరాజు కోరారు గురువారం జిల్లా కేంద్రానికి చెందిన హకీం మహేష్ బాబు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో గచ్చిబౌలిలోని నాలెడ్జ్ సిటీలో ఇపమ్ కంపెనీలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం ఉత్పత్తి చేసే వస్తువు కాదని దాతల సహకారంతోనే ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చు అన్నారు. క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల జీవన విధానంలో మార్పు రావడంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ సూరంపల్లి రాధాకృష్ణ కోటి లైన్స్ బ్లడ్ బ్యాంక్ టీంకు చెందిన విజయకుమార్ బృందం తో పాటు 100 మంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు

## బీడీ ఫ్యాక్టరీ లలో పనిచేసే ప్యాకర్స్ వేతనాలు పెంచాలి

**రాష్ట్ర సహాయ కార్యదర్శి జె ఎన్ దేవదానం...**

**చిన్న చింతకుంట జూన్ 11 (స్కై న్యూస్);** బీడీ ప్యాకర్స్ వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ ప్యాకర్స్ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ)ఆధ్వర్యంలో బీడీ పరిశ్రమకు నిలయమైన చిన్న చింతకుంట లో గురువారం నుండి నిరవధిక సమ్మెకు పునుకోవడం జరిగింది అన్నారు. ఈ సమ్మెను ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టి యు సి ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి ఎన్ దేవదానం, వనపర్తి జిల్లా కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నాయకులు సి రాజు లు మాట్లాడుతూ బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న బీడీ ప్యాకింగ్ వర్కర్స్ కు తగిన వేతనం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. అదేవిధంగా ఎన్నో ఏళ్లుగా ఫ్యాక్టరీలో పని చేస్తున్న ప్యాకర్స్ కు పిఎఫ్ సౌకర్యం కూడా కల్పించడం లేదు అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్న పరిస్థితులలో ఇట్టి వేతనాలు సరిపోక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. కనుక బీడీ పరిశ్రమ యజమానులు తక్షణమే బీడీ ప్యాకర్స్ యొక్క సమస్యలు పరిష్కరించి ప్రస్తుతం ఉన్న ధరల కనుగుణంగా వారికి వేతనాలు పెంచాలని, అదేవిధంగా ప్యాకర్స్ కార్మికులకు పీఎఫ్ అమలు




చేయాలని, పిఎఫ్ కార్డ్స్ ఇవ్వాలని, తదితర సమస్యల పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సమ్మె సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం అన్నారు. లేనిచో ఈ యొక్క సమ్మెను యధావిధిగా కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ ప్యాకర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గోపిరెడ్డి, ఉపాధ్యక్షులు సుందర్,. ప్రధాన కార్యదర్శి బ్రహ్మం,సహాయ కార్యదర్శి రవి, కోశాధికారి కురుమూర్తి, సభ్యులు, గుండన్న, రామచంద్రి, ఇక్బాల్, కృష్ణయ్య గౌడ్, బీస్, కురుమూర్తి, ఎల్లన్న,మాల శేఖర్, రాజు,భరత్, రఫీ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరుమున్సిపాలిటీ కేంద్రంలో నీ పెద్దమ్మతల్లి పండుగ జరుపుకొనుటకై కమిటీ పెద్దలతోబడుగు బలహీన వర్గాల కుల పెద్దలు



**ఆత్మకూర్ జూన్11(స్కై న్యూస్)** ఈనెల30వ తేదీన జరగబోయే పెద్దమ్మతల్లి పండుగ సందర్భంగా ఐదవ వార్డు కౌన్సిలర్ అద్వారంలో నిర్వాహకులు మనివర్ధన్ రెడ్డి గారు పండగకు సంబంధించిన విరాళాలు సేకరించుటకు మీ ముందుకు వస్తున్నాము కావున మనము కమిటీలో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి ఆలయంకమిటీ చైర్మన్ శ్రీ డాక్టర్ మొగిలి శ్రీధర్ గౌడ్ గారి ఆదేశానుసారం భూమి ఉన్నవారు ఎకరాకు 2000 చొప్పున భూమి లేని వారు ఇంటికి 1000 రూపాయలుచొప్పున స్వచ్ఛందంగా చందా ఇవ్వవలసిందిగా ప్రజలను కోరడమైనది అలాగే కొన్ని ఏళ్ల తర్వాత మన ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి పండగ ఎన్నో ఒడిదుడుకులకి ఎదుర్కొంటూ ఒక కొలికి పండుగను తీసుకురావడం జరిగింది అన్ని కులాలు అన్ని మతాలు పెద్దలు అందర్నీ ఒప్పించి ఈ పండుగ ముందుకు సాగాలని ఈ పెద్దమ్మ తల్లి పండుగ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధికి ఎంతో కీలకం ఎన్నో రకాల అభివృద్ధి పనులు నోచుకోవడం లేదు ఈ పెద్దమ్మ తల్లి పండుగతో ఆత్మకూరు అభివృద్ధి ముందుకు సాగుతుందని ప్రజాప్రతినిధులు అన్ని రకాల పార్టీల కార్యకర్తలు పెద్దమ్మతల్లి పండుగకు సహకరించవలసిందిగా కోరుతున్నాం ఎవరికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలు ప్రతి ఇంటికి వెయ్యి రూపాయలు చొప్పున చందా వేయవలసిందిగా ఆలయ కమిటీ సభ్యులు తెలియజేయడమైనది

## నాగులపల్లి గ్రామంలో హైమాస్ట్ లైట్ ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి ప్రారంభించారు స్థానిక సర్పంచ్, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేయగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రజల సమక్షంలో దీన్ని ప్రారంభించారు ఈ



సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాల్లో చీకటి సమస్యను తగ్గించడంతో పాటు మహిళలు, వృద్ధులు రాత్రి వేళల్లో సురక్షితంగా సంచరించేందుకు హైమాస్ట్ లైట్లు ఉపయోగపడతాయని తెలిపారు గ్రామాల్లో భద్రత, రక్షణ పెంపునకు ఇటువంటి సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరిన వెంటనే స్పందిస్తూ గ్రామాల అభివృద్ధి, కనీస వసతుల కల్పన కోసం తన వంతు సహకారం అందిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ కిరణ్ గౌడ్, ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, మోత్కూలగూడ సర్పంచ్ లావణ్య రమేష్, మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు యాదయ్య, నాగభూషణ్, బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 8వ రోజుకు న్యాయవాదుల ఆందోళన

**నల్లా బ్యాడ్జీలతో నిరసన**

**జోగులాంబ గద్వాల, జూన్ 11(స్కై న్యూస్):** జిల్లా కోర్టుకు ప్రజలకు అనువైన స్థలం సాధన కోసం గద్వాల బార్ అసోసియేషన్ చేపడుతున్న ఉద్యమంలో భాగంగా గురువారం న్యాయవాదులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కోర్టు




ప్రధాన ద్వారం వద్ద నల్ల రిబ్బన్‌ల ధరించి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కృష్ణమోహన్ రెడ్డి ఉపాధ్యక్షుడు ఎన్ విజయకుమార్, సంయుక్త కార్యదర్శి పూజారి మాధవి లత యువ న్యాయవాదులు దిలీప్ కుమార్, శ్రీధర్, అంజనేయులు తదితరులు మాట్లాడుతు మా గొంతును నొక్కవచ్చు కానీ మా న్యాయమైన డిమాండ్‌ను కాదన్నారు. కొందరు తమ స్వప్రయోజనం కోసం హైకోర్టు మరియు రాష్ట్ర ప్రభుత్వానికి వాస్తవ విషయాలు తెలుపకుండా పక్కదారి పట్టించే ప్రయత్నం చేయటం వల్లనే ఈరోజు ఇలాంటి పరిణామాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి అనుకొని కావాల్సిన ఐదెకరాల స్థలం ఉన్నప్పుడు రూ 19 కోట్ల ప్రజాధనాన్ని వృధా చేసి గుట్టను చదును చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. అంత దూరం పోవాలన్న ఆలోచన ప్రభుత్వం ఇప్పటికైన వదులుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

## మధ్యాహ్న భోజనం పై కాంప్లెక్స్ లో హెచ్‌ఎం లకు, వంట సిబ్బందికి శిక్షణ...

**చిన్న చింతకుంట జూన్ 11 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట కాంప్లెక్స్ లో గురువారం కాంప్లెక్స్ హెచ్ ఎం వి మాధవి ఆధ్వర్యంలో ఆర్ పి పర్వీన ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులకు, వంట సిబ్బందికి మధ్యాహ్న భోజన అమలు పై శిక్షణ ఇవ్వడం జరిగింది. పాఠశాలలో పాటించాల్సిన పరిశుభ్రత నియమాలు,వండేటప్పుడు,వడ్డించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది.



వార్తాతరంగాలు

శుక్రవారం 12 జూన్ 2026

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పరిగి రోడ్డులో అంబికా స్టీల్ షాప్ సమీపంలో జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశీలించారు ఈ సందర్భంగా లీకేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు మరమ్మతు పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్లు రాజు నాయక్, జమ్రుద్ ఖాన్, మున్సిపల్ అధికారులు సాయి కిరణ్, నరేష్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు మిషన్ భగీరథ లీకేజీ మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అధికారులకు సూచించారు.

## ప్రజల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి వ్యవసాయ అధికారి రమేష్ నాయక్

**ఆత్మకూరు జూన్ 11( స్కై న్యూస్ )** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ అధికారి రమేష్ నాయక్ తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రణాళికతో భాగంగా రేచింతలలో గ్రామసభ నిర్వహించారు వచ్చే వర్షాకాలం సీజన్ అనేక రోగాలు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు అలాగే ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్క ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని వ్యవసాయ అధికారి రమేష్ నాయక్ తెలిపారుగ్రామ సభలో సర్పంచ్ ప్రశాంతి కిరణ్ మరియు ఉప సర్పంచ్ నరేష్ కుమార్ మరియు గ్రామ సభలో గ్రామస్తులు పాల్గొన్నారు

## పంచాయతీ సెక్రటరీ సరితకు ఘన వీడ్కోలు సన్మానం...




**రంగారెడ్డి జిల్లా జూన్ 11: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా గంట్లవెల్లి గ్రామ పంచాయతీ మాజీ సెక్రటరీ సరిత బదిలీ సందర్భంగా గ్రామంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సరిత ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు అనంతరం ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్కటి శివకుమార్ యాదవ్, ఉప సర్పంచ్ మిద్దె మౌనిక, గంట్లవెల్లి మాజీ సర్పంచ్ కర్నాలు యాదమ్మ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ మూడవత్ భాస్కర్ నాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కానుగు బాలమ్మ దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కానుగు అంతయ్య మాతృమూర్తి శ్రీమతి బాలమ్మ గారి దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని నివాళులర్పించారు ఈ సందర్భంగా బాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు బాలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జి.టి వసంత శ్రీనివాస్, గోపాల్, అనిత రఘునాథ్, మాజీ కౌన్సిలర్లు జూపల్లి శంకర్, చెట్ల నరసింహా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సలీం, నందిగామ శ్రీనివాస్, భీమ్ రెడ్డి, గుండు అశోక్, నవీన్, విజయ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్కివేనిగూడ హనుమాన్ దేవాలయ నిర్మాణానికి వై. రవీందర్ యాదవ్ విరాళం



**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని అక్కివేనిగూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హనుమాన్ దేవాలయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వై. రవీందర్ యాదవ్ రూ.30,116 నగదు విరాళాన్ని అందజేశారు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచనలు, ఆశీస్సులతో దేవాలయ నిర్మాణ కార్యక్రమానికి తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని సమర్పించినట్లు తెలిపారు ఈ సందర్భంగా వై. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలు, ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న శ్రీ హనుమాన్ దేవాలయం భక్తులకు పవిత్ర క్షేత్రంగా నిలవాలని ఆకాంక్షించారు దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేసిన వై. రవీందర్ యాదవ్‌కు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ప్రజాసేవతో పాటు దైవసేవలోనూ ముందంజలో ఉంటూ, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న వై. రవీందర్ యాదవ్ చర్యను స్థానికులు అభినందించారు.

# నిరుపేదల అభ్యున్నతికే పథకాలు

**కాంగ్రెస్ ప్రభుత్వం తోనే శాశ్వత పథకాలు సాధ్యం**

**ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించాలి**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**





**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కై న్యూస్)** రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుపేదల అభ్యున్నతి కోసమే అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని వాటిని ప్రజలకు విస్తృతంగా వివరించి పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు గురువారం ఎంపీ మల్లు రవి రూపొందించిన బస్సు యాత్ర నియోజకవర్గం లోని తిమ్మాజీపేట తాడూరు మండల కేంద్రాల్లో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండ సమయం లోని పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి శాశ్వత పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగిందని అందువల్లే నేటికీ కాంగ్రెస్ పార్టీ దళిత బడుగు బలహీన వర్గాలను చెరగని ముద్ర వేసుకుందని వివరించారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర ద్వారా రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందని నాయకులు కార్యకర్తలు విస్తృతంగా ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల తో పాటు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీని గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. తాను పదవుల కోసం కోట్లు సంపాదించేందుకు ఎమ్మెల్యేగా పోటీ చేయలేదని వైద్య నిపుణులుగా ఉన్న తాను ఎంతో డబ్బు సంపాదించే అవకాశాలు ఉన్న వాటిని వదులుకొని మీ అండదండలతో పోటీ చేసి విజయం సాధించడం జరిగినది ప్రజలకు రుణపడి ఉంటానని నియోజకవర్గాన్ని రంగాలలో అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చేయూతనిచ్చేందుకు అమలు చేసిన పథకాలను ఒక్కొక్కటి వివరించారు రైతు ఆత్మీయ భరోసా ఉచిత బస్సు ప్రయాణం వడ్డీ లేని రుణాలు రైతు రుణమాఫీ భూ పంపిణీ ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు పంపిణీ విద్యా వైద్య శాఖలలో సమస్యల పరిష్కారం అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు ఆయా మండలాల అధ్యక్షులు మిద్దె రాములు యారా రమేష్ చూసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వినోద్ తాడూరు సర్పంచ్ మల్లయ్య తో పాటు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రూ.3 వేల కోట్లతో ఇబ్రహీంపట్నం అభివృద్ధి







**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో దాదాపు రూ.3 వేల కోట్ల నిధులను తీసుకువచ్చామని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట్‌లో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా తుర్కయంజాల్ జోన్‌కు చెందిన 153 మంది, పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన 140 మంది, అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన 107 మంది కలిపి మొత్తం 400 మంది లబ్ధిదారులకు రూ.4.46 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 15 ఏళ్ల పాలనలో నియోజకవర్గ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని అన్నారు ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు ఫ్యూచర్ సిటీ వంటి అభివృద్ధి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్న పార్టీలకు రాజకీయ భవిష్యత్తే లేదని విమర్శించిన ఆయన, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నూతన కమిటీలు రాజ్యాధికారం కై పోరాడాలి





**నాగర్ కర్నూల్ తిమ్మాజీపేట జూన్ 11 (స్కైన్యూస్)** బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కమిటీలు బీసీలను ఐక్యం చేసి రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షులు అరవింద చారి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీవిద్య గౌడ్ కోరారు గురువారం నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండల కమిటీని ఎన్నుకున్నారు బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షులుగా శివ ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా శేఖర్ యువజన అధ్యక్షులుగా రమేష్ సోషల్ మీడియా జగదీష్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా మానమ్మా ప్రధాన కార్యదర్శిగా మంజుల ఉపాధ్యక్షురాలుగా సత్యమ్మ లను ఎన్నుకున్నారు అనంతరం అరవింద్ చారి మాట్లాడుతూ చట్టసభలలో బీసీలు అడుగుపెట్టేందుకు ఇప్పటినుండి నాయకులు ఏకమై లక్ష సాధన దిశగా నడుం బిగించాలని కోరారు. రాబోయే రోజులలో బీసీ పొలిటికల్ జేఏసీ రాజకీయ పార్టీగా మారుతుందని అన్నారు మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీవిద్య గౌడ్ మాట్లాడుతూ సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న మహిళల హక్కులు మాత్రం కాల రాస్తున్నారని వాటి కోసం పోరాటం చేయవలసిన అవసరం ఏర్పడిందని అన్నారు. అణగారిన వర్గాల మహిళలను చట్టసభలకు పంపించేందుకు ప్రతి మహిళ ప్రజా వైఫల్యాలను వెంటపడుతూ నిర్వహించే పోరాటాలను విజయవంతం చేయాలని కోరారు

# త్వరలో కార్యకర్తలకు శిక్షణా తరగతులు...

**డిజిటల్ సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలి**

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కై న్యూస్)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండబడుతూనే బోటారు జాబితా సవరణలు నూతన ఓటర్ల నమోదు మార్పులు చేర్పులు తొలగింపులు అంశాలపై పార్టీ నాయకులు కార్యకర్తలకు త్వరలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సూచించారు గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో వివిధ మండలాల ముఖ్య నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై కార్యకర్తలు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని కార్యక్రమం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యకర్తలకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గంలో త్వరలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అదేవిధంగా డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం పెంపొందించుకోవడంతోపాటు ప్రతి ఒక్కరిని పార్టీ పట్ల ఆకర్షితులు అయ్యేలా కృషి చేయాలని దిశ నిర్దేశం చేశారు ఈ సమావేశంలో పార్టీ నాయకులు అర్థం రవి బిజినేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ లక్ష్మయ్య తో పాటు కౌన్సిలర్లు వివిధ మండలాల అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్య నేతలు పాల్గొన్నారు

# వాస్తవాలు వెల్లడైతే చట్టపరమైన చర్యలు...



**సంక్షేమాన్ని విస్మరిస్తే సహించం**

**ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కైన్యూస్)** ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి విద్యాభివృద్ధికి రూపొందించిన పథకాలను అమలు చేస్తూ కేజీబీవీ మరియు గురుకులాలకు సరఫరా చేస్తున్న వస్తువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి హెచ్చరించారు గురువారం పలువురు ఆయనకు వినతిపత్రం సమర్పించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు భద్రత సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించడం జరుగుతుందని పాఠశాలలలో ఆహారం వసతి ఇతర సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. తిమ్మాజీపేట కేజీబీవీ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్న అంశాలు నిజమని తెలిపే బాధ్యులపై శాఖాపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్కు కూడా నివేదిక అందిస్తామని తెలిపారు. నిధులను దుర్వినియోగం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని వదిలిపెట్టేదే లేదని హెచ్చరించారు

# సదరన్ కమాండ్ జీఓసీ-ఇన్-సీ గవర్నర్‌తో భేటీ

**హైదరాబాద్, జూన్ 11(స్కైన్యూస్ , 2026:**పుణెలోని సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ (జీఓసీ-ఇన్-సీ) లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ (ఏవీఎస్ఎం, ఎస్ఎం) తెలంగాణలో అధికారిక పర్యటనలో భాగంగా గురువారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.సదరన్ కమాండ్‌కు చెందిన పలువురు సీనియర్ సైనిక అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ సదరన్ కమాండ్ పరిధిలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, భద్రతా చర్యల గురించి గవర్నర్‌కు వివరించారు.అనంతరం మెదక్--నిజామాబాద్--ఆదిలాబాద్--కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ శ్రీ మల్క కొమరయ్య కూడా లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.గండిపేట చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు గవర్నర్‌ను కలిశారు.వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు శ్రీ సిద్దా వెంకట సూర్య ప్రకాశరావు, సంస్థకు చెందిన ఇతర సభ్యులతో కలిసి లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు.గవర్నర్‌తో జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకుల భేటీ జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు శ్రీ చందా లింగయ్య దొర, సంఘం ప్రతినిధులతో కలిసి గురువారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పొందుపరిచిన నిబంధనల ప్రకారం తెలంగాణలోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో పెసా చట్టం, 1/70 చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని గవర్నర్ కు జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ప్రతినిధులు కోరారు.గిరిజన ప్రాంతాల్లో ఇసుక, ఖనిజ వనరుల వెలికితీత బాధ్యతలను స్థానిక గిరిజనులకే అప్పగించాలని,ఆ నిధులను గిరిజన అభివృద్ధి ప్రాంతాలకే వెచ్చించేలా చూడాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి,భాషా పరిరక్షణ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.





# గోపూజతో అష్టైశ్వర్యాలు

వాసవి మాత ఆలయంలో గోపూజ

ఆవుకు సురభి కోడెదూడకు నందిని నామకరణం





**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కైన్యూస్)** గోపూజతో అష్టైశ్వర్యాలు కలగడంతో పాటు సమాజం సుభిక్షంగా ఉంటుందని పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు బిల్లకంటి హరిబాబు శ్రీశైలం మల్లికార్జున సత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్ అన్నారు గురువారం మిడిదొడ్డి శ్యాంసుందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణ అధ్యక్షుడు హరిబాబు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు పూజించేందుకు గోకర్ణం ఆవు మరియు కోడెదూడకు పూజలు నిర్వహించి ఆలయానికి అందించారు సందర్భంగా వారు మాట్లాడుతూ గోపూజ ఎక్కడైతే నిత్యం జరుగుతుందో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉండడంతో పాటు ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు ఈ సందర్భంగా ఆవుకు సురభిగా కోడెదూడపు నందినిగా నామకరణం చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య మహిళలు భక్తులు పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు

# బలమైన భారత నిర్మాణమే పరివార్ సంస్థల లక్ష్యం



నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





**రంగారెడ్డి జిల్లా జోన్ 11 : ( స్కై న్యూస్ )** సిద్ధిపేటలో మల్లేష్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి "భావజాల పరివార్ సంస్థలు" అంశంపై ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బలమైన భారత నిర్మాణం, స్వావలంబన భారత్ సాధన, భారతదేశాన్ని పరమ వైభవ స్థితికి చేర్చడమే పరివార్ సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు భారతీయ తాత్విక చింతనలోని "వసుధైవ కుటుంబకం" భావన ప్రపంచ శాంతి, సామరస్యం, మానవ సంక్షేమానికి మార్గదర్శకమని పేర్కొన్నారు సమాజ సంఘటన, జాతీయ చైతన్య నిర్మాణం, సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక పునరుజ్జీవనం ద్వారా దేశాన్ని బలోపేతం చేసేందుకు పరివార్ సంస్థలు కృషి చేస్తున్నాయని వివరించారు విద్యార్థి రంగంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), ధార్మిక రంగంలో విశ్వ హిందూ పరిషత్, కార్మిక రంగంలో భారతీయ మజ్దూర్ సంఘ్, రైతు రంగంలో భారతీయ కిసాన్ సంఘ్, గిరిజన సంక్షేమం కోసం వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ తదితర సంస్థలు తమ తమ రంగాల్లో జాతీయ పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాయని తెలిపారు భారతీయత, జాతీయవాదం, సేవ, సమరసత, కర్తవ్యబోధ, సమాజ హితం వంటి విలువల ఆధారంగానే పరివార్ సంస్థలు ముందుకు సాగుతున్నాయని అన్నారు బలమైన భారత్ ద్వారానే ప్రపంచ శాంతి, మానవ సంక్షేమం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు ఈ శిక్షణ శిబిరంలో ఎం. రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేవెళ్ల సహకార సంఘంలో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయి



**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా లోని చేవెళ్ల సహకార సంఘం గోదాంలో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి తెలిపారు చేవెళ్ల మండల రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఆయన, యూరియా అవసరమున్న రైతులు "ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్" యాప్ ద్వారా నమోదు చేసుకుని ఎరువులు పొందాలని తెలిపారు ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ చేపడుతున్నామని, వ్యవసాయ అవసరాలకు తగిన విధంగా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో దేవర సమతా వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, దేవల్‌గారి గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మాజీ వార్డు సభ్యుడు జంగన్నోళ్ల అశోక్, సొసైటీ సిబ్బంది వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు రైతులు అవసరమైన ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకుని వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని సొసైటీ ప్రతినిధులు సూచించారు.

# చేవెళ్ళ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో ఉద్యోగావకాశం



**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ మండల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో చౌకీదార్ ( వాచ్మెన్ ) పోస్టును భర్తీ చేయడానికి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ ( సిటిడబ్ల్యు ) వార్డెన్ విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు వసతి గృహంలో నివసిస్తున్న బాలికల పరిరక్షణ నిమిత్తం అనుభవం కలిగిన మహిళలను నియమించనున్నట్లు పేర్కొన్నారు ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన అర్హత అనుభవ పత్రాలతో కలిసి ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వసతి గృహ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు బాలికల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, సేవాభావం కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డెన్ విజయలక్ష్మి కోరారు.

# పాఠశాల బస్సు డ్రైవర్ ను కరిచిన కుక్క

జంకుతున్న చిన్నారి విద్యార్థులు

వీధి కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలి

కౌన్సిలర్ సుధీర్



**రంగారెడ్డి జిల్లా జోన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని కౌన్సిలర్ బి.ఎస్. సుధీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్స్ఫర్డ్ స్కూల్ సమీపంలో వీధి కుక్క దాడిలో మహేష్ అనే స్కూల్ బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటనపై స్పందించిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ విద్యార్థులు, కాలనీ వాసులను భయాందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే చిన్నారులు కుక్కల కారణంగా భయపడుతున్నారని పేర్కొన్నారు మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ సుధీర్ కోరారు ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి





**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణ మున్సిపాలిటీలో ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి అన్నారు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో ఫైండ్ల గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని 150 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు శిబిరంలో రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, కంటి మరియు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యమే తమకు ముఖ్యమని, కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు అనంతరం కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 6 నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేని పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మునుముందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల మరణాలను అరికట్టాలి






**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కైన్యూస్)** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది చిన్నారుల మరణాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించి డయేరియా నులిపురుగుల నిర్మూలన పల్స్ పోలియో కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ ఆదేశించారు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా నూడల్ పర్సన్స్ మరియు డయేరియా ఛాంపియన్ ఉధృత పల్స్ పోలియో కార్యక్రమం జాతీయ నూలు పురుగుల నిర్మూలన దినోత్సవం పై శిక్షణ తరగతులు ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల మరణాలలో 17% మరణాలు డయేరియా వల్ల సంభవిస్తున్నారని క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందస్తుగానే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని చిన్నారులు డయేరియా బారిన పడినప్పుడు ఏ మోతాదులో మందులు ఇవ్వాలో తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 16 నుండి 31 వరకు డయేరియా నిర్మూలన క్యాంపు నిర్వహించాలని 28 నుండి 30 వరకు ఉధృత పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీ చేయాలని 28న అన్ని బూతులలో పోలియో చుక్కలు అందించాలని 29 మరియు 30 తేదీలలో ఇంటింటికి వెళ్లి చుక్కలు వేయాలని సూచించారు. నెల 13న జాతీయ నూలి పురుగుల దినోత్సవం సందర్భంగా అన్ని అంగన్వాడి కేంద్రాలలో మరియు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో ఆల్బెండిజో మాత్రలు సరఫరా చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవికుమార్ డాక్టర్ సురేష్ బాబు డిపిఓ రేణుక డి పి హెచ్ ఎన్ ఓ మంగమ్మ ఏపీఓ బాదం రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు నూతన డీఎంగా ఎం. కరుణశ్రీ బాధ్యతలు స్వీకరణ



**రంగారెడ్డి జిల్లా జూన్ 11 : ( స్కై న్యూస్ )**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ షాద్‌నగర్ డిపో డీఎంగా పనిచేసిన ఉషా బదిలీపై జనగామ డిపోకు వెళ్లడంతో, షాద్‌నగర్ డిపోకు నూతన డిపో మేనేజర్‌గా ఎం. కరుణశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు ఎం. కరుణశ్రీ గతంలో పరిగి, కామారెడ్డి, హైదరాబాద్-2 డిపోల్లో డీఎంగా విధులు నిర్వహించారు అనుభవజ్ఞులైన ఆమె షాద్‌నగర్ డిపో అభివృద్ధికి కృషి చేస్తారని సిబ్బంది ఆకాంక్షించారు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిపో సిబ్బంది నూతన డీఎం కరుణశ్రీకు ఘన స్వాగతం పలికారు.

## శాతవాహన వ్యాపార వాణిజ్య నిర్వహణ కళాశాల నూతన ప్రిన్సిపల్ నియామకం

**కరీంనగర్ :** శాతవాహన విశ్వవిద్యాలయంలోని వ్యాపార, వాణిజ్య నిర్వహణ కళాశాల (కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్) కళాశాల నూతన ప్రిన్సిపల్ గా డాక్టర్ శ్రీరంగప్రసాద్ ను నియమిస్తూ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ఆదేశాలు జారీ చేయగా రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ నియామక పత్రాలు అందజేయగా విసి సమక్షంలో అందుకున్నారు. డాక్టర్ రంగప్రసాద్ ప్రస్తుతము బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతిగా ఐక్యూఏసి డైరెక్టర్గా పనిచేస్తున్నారు. ఇంతకుముందు ఆయన శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేశారు. అనేక కార్యశాల సదస్సులు బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో నిర్వహించి పలు జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.

## పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో థిమెటిక్ ట్రైబల్ యోగ

**పాడేరు :** ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో థిమెటిక్ ట్రైబల్ యోగ నేడు అనగా11వ తేది గురువారం ఉదయం 6 గంటలకు 500 మందితో యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిషాంతి . టి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ రేపు నిర్వహించబోయే యోగా కార్యక్రమానికి పాడేరు ఐటిడిఏ పివిటిజి ఏపీవో వెంకటేశ్వరరావు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. యోగా కార్యక్రమంలో 500 మందికి తక్కువ కాకుండా పాల్గొనే విధంగా ఏర్పాట్లు చూడాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు యోగా కార్యక్రమంలో నిర్వాహకులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. యోగ కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలలో మౌలిక వసతులు ఏర్పాట్లు, మ్యాట్లు, యోగాసనాలు వేయడానికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ తాగునీటి సదుపాయం, అవసరమైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అందరూ విధిగా కామన్ యోగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. స్కూల్, కాలేజ్ విద్యార్థులు, ఎన్ సిసి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు, యూవత పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.ప్రజాప్రతినిధులు , ప్రముఖులను, స్వాతంత్ర్య సమరయోధులను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలన్నారు.

## ఊరూరా ఘనంగా కవ్వంపల్లి జన్మదిన వేడుకలు

**కరీంనగర్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ)ఎస్సీ సెల్ చైర్మన్, రాష్ట్ర డాక్టర్స్ సెల్ సలహాదారు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా నియోజకవర్గ వ్యాప్తంగా ఊరూర ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బర్త్ డే కేకులను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.మానకొండూర్ లో...మానకొండూర్ మండల కేంద్రంలోనే కాకుండా కొండపలకల, గంగిపల్లి,వన్నారం, గట్టుదుద్దెనపల్లి,చెంజర్ల, ,నిజాయితీ గూడెం, పెద్దూరుపల్లి,ఖాదరగూడెం ,వన్నారం, రంగపేట, కెల్లేడు, మద్దికుంట, వేగురవెల్లి, ఊటూరు,పచ్చునూరు,వెల్ది, సదాశివపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేకులు కట్ చేశారు.బాణసంచా కాల్చారు. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుపతి, గొల్లెన కుమార్, బుర్ర శ్రీధర్, రామడుగు హరీశ్, దూలం దేవేంద్ర, తాళ్లపల్లి నరేష్, మడుపు ప్రేమ్ కుమార్, ఇర్ఫాన్, కోండ్ర సురేష్, వరాలచారి, జేడి శ్యామ్, బుర్ర శ్రీకాంత్,కనకం కుమార్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, ఏఎంసీ,సింగిల్ విండో డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలో...శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పీసీసీ సభ్యుడు,మాజీ జడ్పీటీసీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గట్టు తిరుపతి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి,కొత్తగట్టు టెంపుల్ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఉప్పుగల్ల మల్లారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవ్వ పద్మ, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కె .చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గొట్టే మధు తోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.తిమ్మాపూర్ మండలంలో...తిమ్మాపూర్ మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బుధారపు శ్రీనివాస్, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి, ఎస్.కొండల్ రావు, పోలు రాము, రమేశ్, చింతిరెడ్డి లక్ష్మారెడ్డి,తమ్మనవేణి రమేశ్ తోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు సర్పంచులు, ఉప సర్పంచులు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.గన్నేరువరం మండలంలో...గన్నేరువరం మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ మాజీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, అలువాల కోటి, బుర్ర తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల్లో పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు పంచారు.బెజ్జంకి మండలంలో...బెజ్జంకి మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెజ్జంకి మండల కేంద్రంలో పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, పార్టీ నాయకులు బైరం సంతోష్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఇల్లంతకుంట మండలంలో...ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య, పార్టీ నాయకులు పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎల్లందుల ప్రసాద్, మాతంగి అనిల్, బి.రమేశ్, ఆకుల వెంకన్న తోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లి చౌరస్తాలోట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**సికింద్రాబాద్ :** ఇతర కారణాలతో చనిపోతున్న వారి కంటే కూడా రోడ్డు ప్రమాదలలో చనిపోతున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉంటుందని, ఇది చాలా బాధాకరమని మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నేడు బోయిన్ పల్లి చౌరస్తాలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, ఎక్సైజ్, ఆర్టీఏ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో డీసీపీ ముఖ్యాతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చిన్న చిన్న తప్పిదాలతో ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలు పోగొట్టుకోవడం, క్షతగాత్రులుగా మారడం జరుగుతుందని పేర్కొన్నారు. వాహన దారులే కాకుండా పాదాచారులు, పిల్లలకు కూడా ట్రాఫిక్ నియమ నిబంధనాలపై అవగాహన కల్పించడం ఎంతైనా అవసరమని వెల్లడించారు.

# నారాయణపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### కె. శివకుమార్ నాయుడు, ఐ.ఏ.ఎస్., కమిషనర్, పునరావాసం ఉ భూసేకరణ





**నారాయణపేట జూన్ 11 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లాకు సంబంధించిన వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం (=ఉ=) మరియు పెండింగ్ అంశాలపై ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఐ.ఏ.ఎస్. మరియు పునరావాసం ఉ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు, ఐ.ఏ.ఎస్. అధ్యక్షతన భూసేకరణ, ఇరిగేషన్, సర్వే ఉ భూ రికార్డుల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో భీమా ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను తక్షణమే పూర్తి చేసి, సంబంధిత భూములను ఇరిగేషన్ శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.భీమా మరియు కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని సంబంధిత చీఫ్ ఇంజనీర్‌కు కమిషనర్ సూచించారు. భూసేకరణ ప్రక్రియలో నిధుల కొరత కారణంగా ఎటువంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా మక్తల్--నారాయణపేట--కోడంగల్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ఇరిగేషన్ శాఖ పరిధిలో ఇంకా ఏవైనా పెండింగ్ రిక్విజిషన్లు ఉన్నట్లయితే వాటిని వెంటనే భూసేకరణ అధికారులకు అందజేసి తదుపరి చర్యలు చేపట్టేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.జూరాల ప్రాజెక్టు (గ్రాజీ) పరిధిలోని అనుగొండ, అంకెన్‌పల్లి మరియు దాదన్‌పల్లి పునరావాస కేంద్రాలకు సంబంధించిన భూసేకరణ మరియు అభివృద్ధి పనుల పురోగతిని కూడా సమీక్షించారు. పునరావాస కేంద్రాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ కె. శివకుమార్ నాయుడు మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో అమలవుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టులుగా గుర్తించిందన్నారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందువల్ల పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే పునరావాస కేంద్రాలలో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి, నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన జీవన వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి . హెచ్.ప్రియాంక, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా భూసేకరణ మరియు పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను గారు, భీమా మరియు కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్, భీమా ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్, కోయిల్‌సాగర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రతాప్ సింగ్, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) ఎల్. రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, సహాయ సంచాలకులు (సర్వే ఉ భూ రికార్డులు)తో పాటు ఇరిగేషన్, భూసేకరణ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తూడుకుర్తిలో ముగిసిన ఖో ఖో వేసవి క్రీడా శిక్షణ శిబిరం....







### క్రీడాకారులు క్రమశిక్షణకు మారుపేరు
### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
### డివైఇ సీతారాం నాయక్

**నాగర్ కర్నూల్ జూన్ 11 (స్కై న్యూస్)** మండలంలోని తుడుకుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 45 రోజులుగా ఖో ఖో వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహించి గురువారం నాడు ఖో ఖో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి నాగర్ కర్నూలు జిల్లా డివైఇఓ సీతారాం నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు మల్ల సత్యనారాయణ సాగర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ 45 రోజులుగా తోడుకుర్తి గ్రామ లోని క్రీడా కారులే కాక ఇతర గ్రామాలకు చెందిన క్రీడాకారులు ప్రతిరోజు ఉదయం 5:30 నుండి 7గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుండి 6గంటల వరకు ఖో ఖో క్రీడలో శిక్షణ పొందారు మీరు ఖో ఖో ఆటలో రాష్ట్రస్థాయి కాక జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, పాఠశాలకు, మంచి పేరు తీసుకొచ్చి క్రీడాకారులుగా ఎదగాలని క్రీడాకారులను సూచించారు, 45 రోజులుగా మీకు శిక్షణ అందించిన మన పాఠశాల కోచ్ ఫిజికల్ డైరెక్టర్ సామ రమేష్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు, అనంతరం డివైఇ ఓ సీతారాం మాట్లాడుతూ నాగర్ కర్నూల్ మండల కేంద్రంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖో ఖో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాలుపంచుకున్న క్రీడా కారులందరికీ ప్రపంచ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారనీ, ఈ సందర్భంగా ఖో ఖో క్రీడా వేసవి శిక్షణ శిబిరాన్ని ఈరోజు ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని క్రీడా కారులందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి నీతివంతమైన సమాజాన్ని నిర్మించాలని క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని అన్నారని, ఖో ఖో ఆటతో పాటు, అథ్లెటిక్స్, కబడ్డీ, వంటి క్రీడల్లో రోజు మీరు శిక్షణ పొందుతున్నారని, ఈ శిక్షణ లో మంచి మెలకువలు నేర్చుకొని జూలైలో సెకండ్ వీక్ లో జరిగే ఎస్ జి ఎఫ్ క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని క్రీడాకారులకు సూచించారని, ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అంజయ్య, కృష్ణమోహన్, ప్రసాద్, వెంకట్, మజార్,లు పాల్గొన్నారని, ఖో ఖో వేసవి శిక్షణ శిబిరం కోచ్ సామ రమేష్ తెలిపారు

# విపక్షాలకు ఒకే మాట, ఒకే బాట ఏదీ?



ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వాడిపోయిన ముఖంతో కనపడ్డ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గట్టిగా హత్తుకున్నారు. ఒక స్త్రీ మనసును మరో స్త్రీ తప్ప మరెవరు అర్థం చేసుకోగలరు? 'కొన్ని దృశ్యాలను మాటల్లో చెప్పలేం' అని సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు మహిళలను గతంలో అంతర్జాతీయ సంస్థలు దేశంలోనే అత్యంత శక్తిమంతమైన నేతలుగా అభివర్ణించాయి. సోనియా పది సంవత్సరాలకు పైగా దేశ రాజకీయాలను శాసిస్తే, మమత బెనర్జీ 15 సంవత్సరాలు బెంగాల్ రాజకీయాలను శాసించారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారికి తెలియనిది కాదు. గత నెలలో వెలువడిన అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ వ్యతిరేక శక్తులు మళ్లీ ఢిల్లీలో సమావేశమయ్యాయి. నిన్నటి వరకూ తాము కాంగ్రెస్‌ను కూడా ఢీకొన్న విషయాన్ని మరిచిన మమత బెనర్జీ, వామపక్షాలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై రాహుల్‌గాంధీ ఇటీవలే తనను తీవ్రంగా విమర్శించిన విషయాన్ని మమత బెనర్జీ మరిచిపోయినట్లే కనపడుతోంది. 'దేశంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. ఇక జాతీయ స్థాయిలో నేనే కీలక పాత్ర పోషిస్తాను' అని 2021లో ప్రధానమంత్రి పదవి గురించి కలలు కన్న విషయం కూడా ఆమెకు ఇప్పుడు గుర్తుండే అవకాశాలు లేవు. 1998లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కోల్‌కతాలో ఏఐసీసీ ప్లీనరీ జరుగుతున్నప్పుడు ర్యాలీ నిర్వహించి పార్టీని ప్రకటించిన బెబ్బులి మమత బెనర్జీ ఇప్పుడు కోరలు తీసేసినట్లే కనపడుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో తృణమూల్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆమెపైనే తిరుగుబాటును ప్రకటించారు. ఆమె కుడిభుజం అభిషేక్ బెనర్జీ. ఎంపీ కల్యాణ్ బెనర్జీ తదితర తృణమూల్ నేతలపై వీధుల్లో దాడులు జరుగుతున్నాయి. మమత ఒకప్పుడు ప్రత్యర్థులపై అవలంబించిన విధానాలే ఇప్పుడు ఆమెపై ప్రత్యర్థులు ప్రయోగిస్తున్నారు. కోల్‌కతా వీధుల్లో ఇప్పుడు మమత బెనర్జీ, ఆమె వర్గీయులు అరణ్య రోదన చేస్తుంటే వారికి అండగా ఇప్పుడు కాంగ్రెస్ నేతలే నిలిచే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటు రాష్ట్రంలోనూ, ఇటు ఢిల్లీలోనూ బీజేపీ వంటి మహాశక్తిని ఎదుర్కోవాలంటే కాంగ్రెసే శరణ్యమని మమత బెనర్జీ గ్రహించినట్లు కనపడుతోంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు సీట్లు పెద్దగా గెలుచుకోనప్పటికీ తృణమూల్‌ను బాగా దెబ్బతీయగలిగాయి. ముర్షీదాబాద్, మాల్దా, ఉత్తర్ దినాజ్‌పూర్ లాంటి మైనారిటీల ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్--వామపక్ష కూటమి తృణమూల్‌కు సంప్రదాయంగా లభించే మద్దతు రాకుండా చూశాయి. 50శాతానికి పైగా ముస్లింల జనాభా ఉన్న 32 అసెంబ్లీ స్థానాల్లో తృణమూల్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. జంగీపూర్ అనే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 31వేల ఓట్లు రాగా తృణమూల్ అభ్యర్థికి 10,542 ఓట్లు మాత్రమే లభించాయి. అదే కరండిఘి అనే నియోజకవర్గంలో సీపీఐ(ఎం)కు 39వేల ఓట్లు రాగా, ఆ పార్టీ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి 20వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. బహుశా ఈ ఫలితాలు వచ్చిన తీరు మమత బెనర్జీకి తన అహంకారం, దౌర్జన్యపూరిత ధోరణి, మిత్రపక్షాలను లెక్కచేయనితనం గురించి గుణపాఠాలు నేర్పే ఉంటుంది. అందుకే ఆమె ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో కనపడుతున్నారు. ఇక దేశంలో తమ కాళ్ల కింద నేల క్రుంగిపోతున్న వామపక్షాలకు కూడా ఢిల్లీ వీధులే శరణ్యంగా మారాయి. 140 సీట్లున్న కేరళ అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 100 సీట్లకు పైగా గెలుచుకోవడం, బీజేపీ మూడు సీట్లు గెలుచుకోవడం, పినరయి విజయన్ కేబినెట్‌లో అత్యధిక మంత్రులు పరాజయం పాలుగావడం విస్మరించదగ్గ విషయం కాదు. అక్కడ కూడా పినరయి విజయన్ పదేళ్ల కేంద్రీకృత అహంకార పాలన, రైతులు, యువత, ఆశా వర్కర్లు తీవ్ర నిరుత్సాహానికి గురికావడం, పార్టీ కేడర్ అసంతృప్తి... వంటివి వామపక్ష కూటమి పరాజయానికి కారణమని విశ్లేషకులు అభివర్ణించారు. పినరయి విజయన్ బీజేపీతో కుమ్మక్కయ్యారని, అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నారని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. విజయన్‌పై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ఏమైతేనేం అయిదు దశాబ్దాల తర్వాత దేశంలో ఎక్కడా అధికారంలో లేని పరిస్థితికి వచ్చిన వామపక్షాలు బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేయడం తప్ప తమకు మరో మార్గం లేదని గ్రహించాయి. ఇండియా కూటమి సమావేశానికి హాజరైన వామపక్ష నేతలు డి.రాజా, జాన్ బ్రిటాస్‌కు ఆ స్పష్టత ఉన్నది. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితిని రెండేళ్ల క్రితం మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాగా అర్థం చేసుకున్నారు.

# కాక్టస్ పండును తినవచ్చు, సురక్షితమే..



ముళ్లతో కప్పి ఉండే కాక్టస్ పండును చూసిన వెంటనే చాలామందికి దాన్ని తినాలనే ఆసక్తికంటే భయం ఎక్కువగా ఉంటుంది. కానీ సరైన విధంగా పట్టుకుని తొక్క తీస్తే ఈ పండు చాలా రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో దీనిని ప్రిక్లీ పియర్ అని పిలుస్తారు. బయట భాగం గట్టిగా, ముళ్లతో ఉండినా లోపల భాగం మాత్రం తియ్యగా, రసంతో నిండుగా ఉంటుంది. వేసవిలో శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంలో కూడా ఈ పండు ఉపయోగపడుతుంది. కాక్టస్ పండ్లు ఆకుపచ్చ, పసుపు, గులాబీ, గాఢ ఊదా వంటి రంగుల్లో కనిపిస్తాయి. లోపలి గుజ్జు తేమగా ఉండి స్వల్ప తీపి రుచిని ఇస్తుంది. కొంతమంది దీనిని పుచ్చకాయ, బెర్రీల రుచుల మిశ్రమంలా ఉంటుందని చెబుతారు. ఇందులో చిన్న గింజలు ఉంటాయి. అవి తినడానికి సురక్షితమే. ఈ పండులో ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో శరీరానికి పోషణ అందుతుంది.

> దీన్ని కట్ చేయడంలో జాగ్రత్తలు పాటించాలి..



**ఇలా కట్ చేయాలి..**

ఈ పండుపై ఉండే ముళ్లు మొక్కను రక్షించేందుకు సహజంగా ఏర్పడినవి. పెద్ద ముళ్లతో పాటు కంటికి సరిగ్గా కనిపించని చిన్న రోమాల్లాంటి గ్లోచిడ్స్ కూడా ఉంటాయి. ఇవి చర్మానికి అంటుకుని దురద లేదా అసౌకర్యాన్ని కలిగించవచ్చు. అందుకే పండును చేతులతో నేరుగా పట్టకుండా జాగ్రత్తగా హ్యాండిల్ చేయడం అవసరం. కాక్టస్ పండును కట్ చేయడానికి ముందుగా పదునైన కత్తి, గట్టి కటింగ్ బోర్డు, టాంగ్స్ లేదా మందమైన గ్లౌజులు, తొక్క తీసిన పండును పెట్టడానికి శుభ్రమైన బౌల్ సిద్ధంగా ఉంచుకోవాలి. గ్లౌజులు లేదా టాంగ్స్ ఉపయోగిస్తే ముళ్లు చేతికి గుచ్చుకునే ప్రమాదం తగ్గుతుంది. మొదట పండును టాంగ్స్ సహాయంతో పట్టుకుని నీటితో బాగా కడగాలి. పైభాగంలో ఉండే చిన్న ముళ్లు తొలగేలా మెల్లగా రుద్దాలి. తర్వాత కత్తితో పండు పై భాగం, కింది భాగాన్ని కోయాలి. ఆపై పొడవుగా ఒక చిన్న కోత పెట్టాలి. కోత చాలా లోతుగా కాకుండా కేవలం తొక్క వరకు మాత్రమే ఉండాలి. తర్వాత కత్తి అంచు లేదా వేళ్ల సహాయంతో తొక్కను మెల్లగా పైకి లేపి తొలగించాలి. సాధారణంగా తొక్క ఒకటి లేదా రెండు ముక్కలుగా సులభంగా ఊడిపోతుంది. తొక్కను వెంటనే పారేయాలి. ఎందుకంటే దానిపై ఇంకా చిన్న ముళ్లు ఉండే అవకాశం ఉంటుంది. తొక్క పూర్తిగా తీసిన తర్వాత పండును చేతులతో సురక్షితంగా పట్టుకోవచ్చు.

**అనేక రకాలుగా తీసుకోవచ్చు..**

తొక్క తీసిన కాక్టస్ పండును నేరుగా ముక్కలుగా కట్ చేసి తినవచ్చు. ఇది జ్యూసీగా, చల్లదనాన్ని ఇచ్చేలా ఉండటంతో వేసవిలో మంచి స్నాక్‌గా ఉపయోగపడుతుంది. గింజలు కూడా తినవచ్చు. ఈ పండును ఫ్రూట్ సలాడ్లలో కలిపి తినొచ్చు. సిట్రస్ పండ్లు, బెర్రీలు లేదా మెలన్‌తో కలిపితే మంచి రుచి వస్తుంది. అలాగే స్మూతీలు, జ్యూసుల్లో కూడా ఉపయోగించవచ్చు. మరింత మృదువైన టెక్స్చర్ కావాలనుకుంటే గింజలను వడకట్టుకోవచ్చు. కాక్టస్ పండుతో సోర్బెట్, పాప్సికల్స్, తేలికపాటి పుడ్డింగ్స్ వంటి చల్లని డెజర్ట్స్ కూడా తయారు చేస్తారు. కొన్ని దేశాల్లో దీన్ని సాల్సా వంటి కారంగా ఉండే వంటకాలతో కూడా వడ్డిస్తారు. దీని స్వల్ప తీపి రుచి మసాలా రుచిని సమతుల్యం చేస్తుంది. కాక్టస్ పండ్లు కొనేటప్పుడు గట్టిగా ఉండి స్వల్పంగా మెత్తగా అనిపించే వాటిని ఎంచుకోవాలి. చాలా గట్టిగా ఉంటే ఇంకా పండని అవకాశం ఉంది. మరీ ఎక్కువగా మెత్తబడితే పండు పాతదై ఉండొచ్చు. తొక్క తీసిన తర్వాత ఫ్రిజ్‌లో గాలి చొరబడని డబ్బాలో పెట్టి రెండు రోజుల్లోపు తింటే తాజాగా ఉంటుంది. మొదట చూసినప్పుడు భయపెట్టేలా కనిపించినా సరైన విధంగా కట్ చేసి తింటే కాక్టస్ పండు ఎంతో రుచికరమైనది. పోషకాలు, తేమ, చల్లదనాన్ని అందించే ఈ ప్రత్యేక పండును ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను గణనీయంగా తగ్గించే అవకాడో..

## రోజూ తీసుకుంటే ఎంతో మంచిది..



మనం ఆహారంగా తీసుకోదగిన పండ్లల్లో అవకాడో ఒకటి. ప్రస్తుతం అవకాడో ఫిట్‌నెస్ ప్రియులు ఎక్కువగా తీసుకుంటున్న ఆహారాల్లో ఒకటిగా మారింది. సలాడ్లు, స్మూతీలు, టోస్ట్‌లు, గ్వాకమోలే వంటి వంటకాలలో దీనిని విరివిగా ఉపయోగిస్తున్నారు. తక్కువ చక్కెరలు, మంచి కొవ్వులు అధికంగా ఉండటంతో అవకాడోకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. మృదువైన వెన్నలాంటి గుజ్జుతో ఉండే ఈ పండు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రెండు వారాల పాటు ప్రతిరోజూ అవకాడో తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని పేర్కొంటున్నారు.

**కొలెస్ట్రాల్ తగ్గేందుకు..**

అవకాడోలో మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌గా భావించే ఎల్‌డీఎల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ పండులో ఫైబర్‌తోపాటు కొన్ని మొక్కల సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడతాయి. ఫలితంగా జీర్ణక్రియ మెరుగుపడి జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. అవకాడోలో పొటాషియం కూడా అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే గుండె సంబంధిత ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కలయిక వల్ల అవకాడో ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో అతిగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంటుంది. రోజుకు అర అవకాడో నుంచి ఒక అవకాడో వరకు తీసుకోవడం చాలామందికి సరిపోతుందని సూచిస్తున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికం..**

వెన్న, మయోనైస్ లేదా ఎక్కువ క్రీమ్ ఉండే డ్రెస్సింగ్‌లకు బదులుగా అవకాడోను ఉపయోగిస్తే ఆహారంలోని కొవ్వుల నాణ్యత మెరుగుపడుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు. అవకాడోలో గ్లుటాథయోన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల కాలేయం హానికర పదార్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు. అలాగే ఇందులో విటమిన్ సి, బీ9, ఇ లాంటి యాంటీ ఆక్సిడెంట్ విటమిన్లు ఉండటంతో శరీర కణాలను రక్షించడంలో ఉపయోగపడతాయి. కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే ఖనిజాలు కూడా ఇందులో లభిస్తాయని చెబుతున్నారు. ఒలెక్ యాసిడ్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు కూడా అవకాడోలో ఉండటం వల్ల శరీరానికి మంచి శక్తిని అందించడంలో ఇది సహాయపడుతుంది. సరైన మోతాదులో తీసుకుంటే అవకాడో సమతుల ఆహారంలో ఆరోగ్యకరమైన ఎంపికగా ఉపయోగపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## చియా సీడ్స్, గుమ్మడి విత్తనాలు వంటి సీడ్స్‌ను రోజులో ఏ సమయంలో ఎలా తీసుకుంటే మేలు చేస్తాయి?

నేటి తరుణంలో ఆరోగ్యం మీద అవగాహన రావడంతో చాలా మంది విత్తనాలను ఆహారంగా తీసుకుంటున్నారు. విత్తనాలు చాలా మందికి ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైన భాగంగా మారిపోయాయని చెప్పవచ్చు. చియా సీడ్స్ నుంచి గుమ్మడి గింజలు, సన్‌ఫ్లవర్ సీడ్స్ వరకు చాలామంది రోజూ తీసుకుంటున్నారు. వీటిలో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో శరీరానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. అయితే వీటిని సరైన సమయంలో, సరైన విధంగా తీసుకోకపోతే పూర్తి పోషకాలు శరీరానికి అందకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న మార్పులతోనే వీటి ప్రయోజనాలను మరింతగా పొందవచ్చని సూచిస్తున్నారు. ఏయే విత్తనాలను ఎలా, ఎప్పుడు తీసుకోవాలో వారు వివరిస్తున్నారు. చియా సీడ్స్ ప్రస్తుతం ఎక్కువగా ఉపయోగిస్తున్న విత్తనాలలో ఒకటి. ఇవి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇందులో ఉండే సొల్యూబుల్ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో కూడా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలో శక్తి సమతుల్యతకు, కొవ్వు తగ్గించుకోవడానికి తోడ్పడుతుంది. అలాగే చియా సీడ్స్‌ను నేరుగా తినడం కంటే ముందుగా నీటిలో నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఒక గ్లాస్ నీటిలో వేసి కొంతసేపు ఉంచితే అవి విస్తరించి జెల్‌లా మారతాయి. ఆ తరువాత అదే నీటితో కలిసి తీసుకుంటే శరీరం పోషకాలను సులభంగా గ్రహిస్తుంది.



**పొద్దు తిరుగుడు, గుమ్మడి విత్తనాలు..**

సన్‌ఫ్లవర్, గుమ్మడి విత్తనాలను చాలామంది ఎప్పుడైనా స్నాక్‌లా తింటుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనంలో ఉండే మంచి కొవ్వులు ఈ విత్తనాల్లోని జింక్, మెగ్నీషియం వంటి ఖనిజాలను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడతాయి. ఈ విత్తనాలను తేలికగా డ్రై రోస్ట్ చేసి తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వాటి పోషకాలు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణం కావడం కూడా సులభమవుతుంది. అదే విధంగా బేసిల్ సీడ్స్ వేసవిలో ఎక్కువగా ఉపయోగపడే విత్తనాలుగా భావిస్తారు. ఇవి శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడతాయి. మధ్యాహ్న భోజనం ముందు, అంటే మిడ్ మార్నింగ్ సమయంలో తీసుకుంటే శరీరం పోషకాలను బాగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**బేసిల్ సీడ్స్..**

వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో కూడా బేసిల్ సీడ్స్ కూడా ఉపయోగపడతాయి. ఈ సీడ్స్‌ను కూడా ముందుగా నీటిలో నానబెట్టాలి. అవి విస్తరించిన తర్వాత తీసుకుంటే చల్లదనంతో పాటు హైడ్రేషన్ ప్రయోజనాలు మరింతగా అందుతాయి. విత్తనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినా, వాటిని ఎలా తీసుకుంటున్నామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన సమయంలో తీసుకోవడం, కొన్ని విత్తనాలను నానబెట్టి తీసుకోవడం వల్ల ఫైబర్, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి మెరుగ్గా అందుతాయి. కాబట్టి ఇకపై విత్తనాలను తీసుకునేటప్పుడు సమయం, విధానం రెండింటినీ గమనిస్తే ఆరోగ్య ప్రయోజనాలు మరింతగా పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

# బిజినెస్

## డాలర్లలో పెట్టుబడి.. కొత్త మ్యూచువల్ ఫండ్




ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్‌సీఏ) నియంత్రణలో ఉండే మార్సెలస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్--గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ తాజాగా గ్లోబల్ ఈక్విటీస్ ఫండ్‌ని ఆవిష్కరించింది. భారతీయ ఇన్వెస్టర్లు.. గ్లోబల్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూన్ 8న ప్రారంభమై జూన్ 19న ముగుస్తుంది. కనీసం 5,000 డాలర్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ప్రధానంగా డిఫెన్స్--ఏరోస్పేస్, విద్యుదుత్పత్తి, లగ్జరీ కన్జంప్షన్ తదితర ట్రెండ్స్‌కి అనుగుణంగా ఉన్న సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. పెట్టుబడులను విదేశీ కరెన్సీలో రిడీమ్ చేసుకోవచ్చు. పాన్, ఆధార్ వివరాలతో ఇన్వెస్ట్ చేయొచ్చు. గిఫ్ట్ సిటీలో విడిగా బ్యాంకు ఖాతా అవసరం లేదు.

## అదే ట్రెండ్.. మళ్లీ తగ్గిన బంగారం ధరలు



గత వారమంతా తగ్గిన బంగారం ధరలు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ వారం మొదటి రోజునే మళ్లీ ధరల్లో కోత పడింది. భారత్‌లో మేలిమి బంగారం ధర సగటున రూ.1000 మేర తగ్గింది. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి (జూన్ 8) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు పడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే ధరలో రూ.1,040ల మేర కోత పడింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి కూడా రూ.950ల మేర తగ్గి రూ.1,39,050కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి రూ.2.7 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,700గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,51,690ల వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల పసిడి రూ.1,39,050ల వద్ద ట్రేడవుతోంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది. వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.6 లక్షల నుంచి రూ.2.7 లక్షల మధ్య కొనసాగుతోంది.

# పశ్చిమాసియా యుద్ధం.. పెరిగిన నిత్యావసర ధరలతో భారతీయుల ఇక్కట్లు

ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. ఇండియాలో వరుసగా ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. అసలు ఎల్పీజీ సిలిండర్లు దొరకడమే కష్టమైపోయింది. ఇదంతా ఇప్పుడు సామాన్యుడిపై పడుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. దీనికి పశ్చిమాసియా యుద్ధంతోపాటు అనేక కారణాలున్నాయి.



ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఇటీవల ఆర్బీఐ వేసిన అంచనాలు, ఈ ఏడాది సాధారణ వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, రూపాయి బలహీనపడటం వంటివి అన్నీ కలిపి ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. చమురు ధరలు పెరగడం కారణంగా ముడి సరుకు ధరలు పెరిగి, ఫలితంగా ఆహార తయారీ సంస్థలకు ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. అలాగే, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దీనివల్ల కలిగే నష్టాన్ని కంపెనీలు వినియోగదారులపైకి మళ్లిస్తున్నా. ఆహారోత్పత్తులు, నిత్యావసరాల ధరలు పెంచుతున్నాయి. లేదా వస్తువుల పరిమాణం తగ్గిస్తున్నాయి. అన్నిరంగాలపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది.

ముఖ్యంగా ముడిసరుకుల ధరలు, రవాణా చార్జీలు పెరగడం సమస్యగా మారింది. ప్యాకేజింగ్ ఖర్చులు కూడా పెరిగాయి. ఇందుకు అవసరమైన ముడిసరుకులైన ప్లాస్టిక్ ర్యాపర్లు, అట్టలు వంటివి, ఇతర ఉత్పత్తులు కూడా విదేశాల నుంచి రావాలి. వీటి ధరలు కూడా పెరుగుతుండటం కంపెనీలకు భారంగా మారింది. విదేశాల నుంచి రావాల్సిన అనేక సరుకుల రవాణా నిలిచిపోవడం పెద్ద సవాలుగా మారింది. వీటన్నింటినీ ముందుగా ఎదుర్కొనేందుకు సిద్ధమైనవి ఎఫ్ఎంసీజీ కంపెనీలే. హిందుస్తాన్ యునిలీవర్, గోద్రేజ్, డాబర్ ఇండియా వంటి కంపెనీలు ఇప్పటికే స్వల్పంగా తమ ఉత్పత్తుల ధరలు పెంచాయి. అలాగే బ్రిటానియా వంటి సంస్థలు తమ ఉత్పత్తుల బరువు, పరిమాణం తగ్గిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.20 వరకు ఉండే వస్తువుల ధరలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. వీటి ధరలు పెంచడం ఆయా కంపెనీలకు అంత లాభదాయకం కాదు. అందుకే ఉత్పత్తుల బరువు తగ్గించాలని చూస్తున్నాయి. దీన్ని ష్రింక్‌ఫ్లేషన్ అంటారని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ప్రస్తుత సంక్షోభం కారణంగా దేశంలో ఆటోమొబైల్ ఉత్పత్తులైన బైకులు, కార్లపై కూడా పడుతోంది. వాహనాల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. విమానాల ఫ్యుయెల్ ధరలు పెరగడంతో చాలా సంస్థలు విమాన సర్వీసుల్ని నిలిపివేశాయి. ఇదే సమయంలో కంపెనీలు తమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సిబ్బందికి అనవసర ప్రయాణాల్ని నిలిపివేసింది. అలాగే, మార్కెటింగ్, అడ్వర్‌టైజింగ్ ఖర్చుల్ని కూడా కంపెనీలు తగ్గించుకుంటున్నాయి. కంపెనీలు పెరిగిన ఈ ఖర్చుల్ని తమ వినియోగదారులపైకి మళ్లిస్తున్నాయి. దీంతో సామాన్యుడు ఇబ్బందిపడుతున్నాడు.

## భారీ నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్‌లు.. కారణాలు ఇవే..!

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా బలహీన సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ముడిచమురు ధరలు భగ్గుమనడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ కీలక సూచీలు 1 శాతానికి పైగా పతనమయ్యాయి. ఈ ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే సెన్సెక్స్ 800 పాయింట్లకుపైగా నష్టపోయి 73,421 వద్ద ట్రేడ్ అయింది. అలాగే నిఫ్టీ కూడా 286 పాయింట్లు కోల్పోయి 23,080 వద్దకు జారుకుంది.

దాదాపు అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. రియల్టీ సూచీ దాదాపు 2 శాతం పడిపోగా, మెటల్, ఆటో, ఐటీ సూచీలు 1 శాతానికి పైగా నష్టాలను చవిచూశాయి. నిఫ్టీలో విప్రో, టీసీఎస్, హిందాల్కో ఇండస్ట్రీస్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి షేర్లు మేజర్ లూజర్లుగా నిలిచాయి. ఫ్రంట్‌లైన్ సూచీలతోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1 శాతం మేర పతనమయ్యాయి. మార్కెట్లలో భయానికి సూచికగా భావించే ఇండియా విక్స్ ఏకంగా 15 శాతం పెరిగి 18 స్థాయికి చేరడం ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆందోళనను సూచిస్తోంది. పశ్చిమాసియాలో



ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య దాడులు పునరుద్ధరించడం, ఇరాన్‌లోని పలు నగరాల్లో పేలుళ్లు సంభవించాయన్న వార్తలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి ద్వారా జరిగే ముడిచమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే భయాలు పెరిగాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 4 శాతం పెరిగి బ్యారెల్‌కు 96.90 డాలర్లకు చేరింది. కానీ మధ్యాహ్నానికి మార్కెట్‌లు కాస్త కోలుకున్నాయి. సెన్సెక్స్ నష్టం 420 కి తగ్గింది. అదేవిధంగా నిఫ్టీ ఫిఫ్టీ నష్టం కూడా 140 కి తగ్గింది.

# టీమిండియాకు షాక్.. ఆఫ్గన్‌పై గెలిచినా దండగే!

అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన టెస్టును టీమిండియా మూడు రోజుల్లోనే ముగించింది. ఒక ఇన్నింగ్స్ మాత్రమే ఆడిన టీమిండియా భారీ స్కోరు చేయడమే గాక అఫ్ఘానిస్తాన్‌ను రెండుసార్లు ఆలౌట్ చేసింది. అయితే ఆఫ్గన్‌పై భారీ విజయం సాధించినప్పటికీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిఫ్ (డబ్ల్యూటీసీ) పట్టికలో భారత్ స్థానం మాత్రం మారకపోవచ్చు. ప్రస్తుతం గిల్ సేన 48.15 పర్సంటేజ్ పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతుంది. మరి ఆఫ్గన్‌పై టెస్టు విజయం సాధించినా డబ్ల్యూటీసీ పట్టికలో టీమిండియా స్థానం మారకపోవడానికి కారణమేంటనేది తెలుసుకుందాం. అఫ్గానిస్తాన్‌తో టెస్టు మ్యాచ్ డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్ సైకిల్‌లో లేదు. అందుకే ఈ మ్యాచ్‌లో భారీ విజయం సాధించినా ఎలాంటి పాయింట్లు రావు. అందుకే డబ్ల్యూటీసీ పట్టికలో టీమిండియా స్థానం మారదు. 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా ఇప్పటివరకు ఆడిన 9 టెస్టుల్లో నాలుగింట గెలిచింది. భారత్ తన డబ్ల్యూటీసీ సైకిల్‌ను ఇంగ్లండ్ టూర్‌తో మొదలుపెట్టింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా సౌతాఫ్రికా చేతిలో మాత్రం క్లీన్‌స్వీప్‌కు గురైంది. అయితే వెస్టిండీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా డబ్ల్యూటీసీ పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ఇక డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో



ఆస్ట్రేలియా (8 టెస్టుల్లో 7 విజయాలు) 87.50 పర్సంటైల్‌తో తొలి స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా (75 పర్సంటైల్‌తో) రెండో స్థానంలో, శ్రీలంక (66.67 పర్సంటైల్‌తో) మూడో స్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ (58.33), బంగ్లాదేశ్ (58.33) పర్సంటైల్‌తో వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇక ఇంగ్లండ్ (37.88) ఏడో స్థానంలో ఉండగా.. పాకిస్తాన్ (8.33), వెస్టిండీస్ (4.13) పర్సంటైల్ పాయింట్లతో చివరి రెండు స్థానాల్లో ఉన్నాయి.

## 'నన్ను రిటైర్ అవ్వమంటున్నారా?'.. భారత కెప్టెన్ అసహనం!

జూన్ 11 నుంచి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి పొట్టి ప్రపంచకప్‌కు ఇంగ్లండ్ వేదిక కానుంది. టీ20 ప్రపంచకప్‌లో పాల్గొంటున్న ఆయా జట్ల కెప్టెన్లు ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా లండన్‌లో ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా ఒక రిపోర్టర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఉద్దేశించి..'హర్మన్‌ప్రీత్ కౌర్.. ఇది మీకు చివరి టీ20 ప్రపంచ కప్ అవుతుందా? దీనిపై మీరేమంటారు?' అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతో ఒక్కసారిగా అసహనానికి గురైన హర్మన్‌ప్రీత్ కౌర్.. 'ఇది నా చివరి వరల్డ్ కప్ ఎందుకు అవుతుంది? నేనేమైనా రిటైర్ అయిపోవాలని మీరు కోరుకుంటున్నారా?' అంటూ హర్మన్‌ప్రీత్ ఎదురుప్రశ్న వేశారు. దాంతో సదరు రిపోర్టర్ పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తూ.. 'లేదు.. నేను కేవలం తెలుసుకోవాలని అడిగాను. ఇది మీ చివరి ప్రపంచకప్ కాదని వినడం నాకు సంతోషంగా ఉంది' అని రిపోర్టర్ చెప్పారు. అయినప్పటికీ తగ్గని హర్మన్‌ప్రీత్ కౌర్.. 'మరి అలాంటప్పుడు అసలు ఆ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు?' అంటూ నిలదీశారు. హర్మన్ మాట్లాడుతూ.. వన్డే వరల్డ్‌కప్ నెగ్గడంతో సహజంగానే మాపై అంచనాలు ఉంటాయి. భారీ అంచనాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇలాంటి సమయంలో ఆ అంచనాలను అందుకుంటూనే ఆటపై పూర్తి ఫోకస్‌ను ఉండేలా చూసుకోవాలి. కానీ వన్డే ఫార్మాట్, టీ20 ఫార్మాట్‌లు వేర్వేరు. ఈ రెండింటికీ వ్యత్యాసం ఉంటుంది. మ్యాచ్‌ల విషయంలో ప్రజలు ఎంతో భావోద్వేగంతో ఉంటారు. వారు ఎప్పటికప్పుడు మమ్మల్ని నిశితంగా పరిశీలిస్తారు. ' అని చెప్పుకొచ్చింది. గతేడాది సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌ను గెలిచిన హర్మన్‌సేనపై భారీ అంచనాలున్నాయి. జూన్ 14 నుంచి భారత్ తమ ప్రపంచకప్ ప్రయాణాన్ని ఆరంభించనుంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా దాయాది పాకిస్తాన్‌తో టీమిండియా తొలి మ్యాచ్ ఆడనుంది.

# స్పోర్ట్స్

## అఫ్ఘనిస్తాన్‌ను దెబ్బతీసిన ఇండియన్ స్పిన్నర్లు.. ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారీ విజయం




**న్యూ చండీఘడ్:** భారత్‌తో జరిగిన ఏకైక టెస్టులో అఫ్ఘనిస్తాన్ చిత్తుగా ఓడింది. న్యూ చండీఘడ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారత్ భారీ విక్టరీ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో అఫ్ఘనిస్తాన్ కేవలం 112 పరుగులకే ఆలౌటైంది. ఇవాళ మూడవ రోజు 14 వికెట్లు పడ్డాయి. ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 564 రన్స్ చేయగా, అఫ్ఘనిస్తాన్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 152 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్ మానవ్ సుతార్ ఆరు వికెట్లు తీసి అఫ్ఘన్ బ్యాటర్లను దెబ్బతీశాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడిన అఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. టాపార్డర్ బ్యాటర్ల దాదాపు విఫలం అయ్యారు. ఓపెనర్ అటల్ 42, గుర్బాజ్ 24 రన్స్ చేశారు. 412 పరుగులు వెనకబడి ఫాలోఆన్ ఆడిన అఫ్ఘనిస్తాన్ ఎక్కడ కూడా నిలదొక్కుకునే ప్రయత్నం చేయలేదు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. అఫ్ఘనిస్తాన్ కేవలం 35.3 ఓవర్లలో తన రెండో ఇన్నింగ్స్‌లో 112 రన్స్ చేసి ఆలౌటైంది. మూడో రోజు వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు.

## గీతు మోహన్‌దాస్ యాక్షన్ అవతార్.. యశ్ టాక్సిక్ బీటీఎస్ వీడియో అదిరిందంతే



కన్నడ, తెలుగు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి టాక్సిక్ ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరో యశ్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. యశ్ 19వ చిత్రంగా వస్తోన్న టాక్సిక్‌కు పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న వారికి అదిరిపోయే వార్తను గ్లింప్స్ రూపంలో అందించారు మేకర్స్.తెలుగు వార్తలు గీతు మోహన్ దాస్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ డైరెక్టర్‌గా ఆమెలోని యాక్షన్ అవతార్‌ను ప్రేక్షకులకు చూపిస్తూ బీటీఎస్ వీడియోను షేర్ చేశారు. యశ్ అండ్ టీంపై వచ్చే స్టైలిస్ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎలా డిజైన్ చేసిందో బీటీఎస్‌వీడియో హింట్ ఇచ్చేస్తుంది. గీతు మోహన్ దాస్ సెట్స్‌లో యాక్షన్ సీన్లను వివరిస్తున్న తీరు టాక్సిక్‌లో యశ్‌లోని నయా స్టైలిష్ అవతార్‌ను చూపించబోతున్నట్టు అర్థమవుతోంది. మొత్తానికి గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేయాలని గట్టిగానే ఫిక్సయినట్టు తాజా వీడియో చెబుతోంది. ఈ మూవీని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.టాక్సిక్ చిత్రంలో బాలీవుడ్ భామలు హ్యూమా ఖురేషి, టారా సుటారియా కీ రోల్స్‌లో నటిస్తుండగా.. అక్షయ్ ఒబెరాయ్ మరో కీలక పాత్ర పోషిస్తున్నాడు. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## ఆగస్టు 7న 'కొరియన్ కనకరాజు' రిలీజ్? వరుణ్ తేజ్ మూవీపై ఆసక్తి పెంచుతున్న కొత్త అప్‌డేట్స్!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'పై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే విడుదలైన టీజర్, ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని 2026 ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఈ రిలీజ్ డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా జూన్ మూడో వారంలో ఈ చిత్రానికి సంబంధించిన మరో ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించగా, కొత్త గ్లింప్స్‌తో సినిమాపై మరింత ఆసక్తి పెంచాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన యువ నటి రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజా తరం ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా కామెడీ, యాక్షన్, ఎమోషన్ అంశాల సమ్మేళనంగా సినిమా రూపొందుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.



## చిత్ర పరిశ్రమలో ఇంకా వివక్ష ఉంది.. కాజల్ షాకింగ్ కామెంట్స్

అందం, ఐశ్వర్యం, ఆనందం, ఆసక్తి, ఆకర్షణ, నిరాకరణ, సంతృప్తి, అసంతృప్తి, ఆవేదన అన్నీ కలగలిపిన పరిశ్రమ సినిమా. ఇక్కడ ప్రతిభ, అదృష్టాలను పరీక్షించుకుని ఉన్నంత స్థాయికి చేరుకున్న వారు ఎందరో. తమ కలలను పండించుకోవడానికి నిరంతరం శ్రమిస్తున్నా వారు ఉన్నారు. అదే సమయంలో వివక్ష గొంతెత్తే వారు ఉంటూనే ఉన్నారు. అలాంటి వారిలో ఇప్పుడు కాజల్ అగర్వాల్ చేరారు. లక్ష్మీకల్యాణం అనే తెలుగు చిత్రంతో కథానాయికిగా ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత వరుసగా అవకాశాలను అందుకుంటూ అగ్ర కథానాయిక స్థాయికి చేరారు. కాజల్ బిజీగా ఉన్న తరుణంలోనే పెళ్లి చేసుకుని సంసార జీవితంలోకి ప్రవేశించారు. అలా ఒక బిడ్డకు తల్లి కూడా అయినా ఈ ఉత్తరాది భామ మళ్లీ నటనపై దృష్టి పెట్టారు. కాజల్ తాజాగా నటించిన ది ఇండియా స్టోరీ చిత్రం జూలై 24న తెరపైకి రానుంది. కమలహాసన్‌తో కలిసి నటించిన ఇండియన్--3 చిత్రం విడుదల కావలిసి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కాజల్ సందర్భం వచ్చినప్పుడల్లా గ్లామర్ ను ప్రదర్శిస్తూ అవకాశాల వేటలో పడుతున్నారు. తాజాగా చిత్రపరిశ్రమలో వివక్ష గురించి ఒక ఇంటర్వ్యూలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. పారితోషికం విషయంలో ఆడ, మగ మధ్య వివక్ష లేదని చెప్పలేను కానీ ఈ పరిస్థితి మారాలి. సినిమా ఇప్పుడు కార్పొరేట్‌గా మారిపోతోంది. అయినా ఆడ, మగ మధ్య పారితోషికం విషయంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. నాకు దక్షిణాది చిత్ర పరిశ్రమపై ఆసక్తి ఎక్కువ. నాకు అక్కడ లేని సౌకర్యం దక్షిణాది చిత్ర పరిశ్రమలో కలుగుతుందని కాజల్ అగర్వాల్ పేర్కొన్నారు.

## నా ఆలోచనా విధానాన్ని వాళ్లు అర్థం చేసుకోలేదు..

### హాట్ టాపిక్‌గా కంగనా రనౌత్ కామెంట్స్



ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి సినీ ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడమంటే చాలా కష్టమని తెలిసిందే. అందులోనా ప్రత్యేకించి సినీ పరిశ్రమలో రాణించాలనుకునే అమ్మాయిలు ఎన్నో కష్టాలను అధిగమిస్తే కానీ సక్సెస్‌ను అందుకోలేరు. అలా సక్సెస్‌ఫుల్‌గా స్టార్‌డమ్ సంపాదించుకోవడమే కాదు రాజకీయాల్లోకి కూడా ఎంట్రీ చట్టసభల్లోకి అడుగుపెట్టింది బాలీవుడ్ భామ కంగనారనౌత్. ఇండస్ట్రీలో ముక్కుసూటితనంతో మొహమాటం లేకుండా ఏ విషయాన్నైనా కుండబద్దలు కొట్టే అతికొద్ది నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది కంగనారనౌత్. ప్రస్తుతం భారత్ భాగ్య విధాత సినిమాలో నటిస్తోంది కంగనా. ఈ మూవీ ట్రైలర్‌కు మంచిస్పందన వస్తోంది. ఈ సందర్భంగా ఓ చిట్ చాట్ సెషన్‌లో తన వ్యక్తిగత జీవిత ప్రయాణం, ప్రొఫెషనల్ జర్నీ, సినిమా గురించి కంగనారనౌత్ పలు విషయాలు షేర్ చేసుకుంది. తన తల్లిదండ్రులు తన ఆలోచన విధానాన్ని అర్థం చేసుకోలేదంటూ కెరీర్ తొలినాళ్లకు సంబంధించిన విషయాన్ని షేర్ చేసుకుంది. తాను ఇండస్ట్రీకి 16, 17 ఏండ్ల వయస్సులో ఎంట్రీ ఇచ్చానని.. ఆ తర్వాత క్వీన్, తను వెడ్స్ మను చిత్రాల్లో మంచి సక్సెస్ అందుకున్నానని చెప్పింది. అయితే తాను మంచి స్టార్‌డమ్ సంపాదించినప్పటికి ఎల్లప్పుడూ తన ఎదుగుదల ఇండస్ట్రీలో తన చుట్టూ ఉన్నవారికి నష్టం కలిగించకూడదని నమ్మానని చెప్పింది కంగనా. తన సక్సెస్‌తోపాటు ఇతరులను కూడా ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే కోరిక తనకు ఎప్పుడూ ఉండేదని, ఈ నమ్మకం సిల్వర్ స్క్రీన్‌పై, స్క్రీన్ వెనుక తన నిర్ణయాలను ప్రభావితం చేస్తూనే ఉందని చెప్పుకొచ్చింది కంగనా రనౌత్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## నాగచైతన్య వృషకర్మ నుంచి క్రేజీ న్యూస్.. భారీ మొత్తం పలికిన శాటిలైట్ రైట్స్..!

తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' . ఈ మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది..వార్తాపత్రిక చందా 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్‌రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్.తెలుగు వార్తలు వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# ప్రధాని మోదీకి కేంద్ర కేబినెట్ స్టాండింగ్ ఒవేషన్



ప్రధానిగా ఎక్కువ రోజులు దేశాన్ని పాలించి రికార్డు సృష్టించిన నరేంద్ర మోదీని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అంతేకాదు కేంద్ర మంత్రులు కేబినెట్ సమావేశంలో లేచి నిలబడి ఘనంగా ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. మొదటి సార్వత్రిక ఎన్నికల తర్వాత అత్యధిక కాలం అంటే వరుసగా 4,398 రోజులపాటు ప్రధానిగా సేవలు అందించిన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఈ రోజుతో మోదీ అధిగమించారు. ఈ నేపథ్యంలో కేబినెట్ మంత్రులు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.

**నాకు ఇదే అసలైన పరీక్ష!**

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ స్పందిస్తూ, ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అత్యంత పెద్ద పరీక్ష అని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ సంస్కృత శ్లోకాన్ని ఆయన పోస్టు చేస్తూ దాని భావాన్ని వివరించారు. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠ అనేవి ప్రజల నమ్మకాన్ని సంపాదించడానికి అవసరమైన సద్గుణాలు అని అన్నారు.

"ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠతో నిరంతరం పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందుతాడు. 'సదనురక్తప్రకృతిః ప్రజాపాలనతత్పరః వినీతాత్మా హి నృపతిర్భూయసీం శ్రియమశ్నుతే'- దీని అర్థం ఏమిటంటే, ఎవరైతే ఎల్లప్పుడూ ప్రజల సంరక్షణకు అంకితమవుతారో, వినయపూర్వకమైన మనస్తత్వం కలిగిన ఆ పాలకుడే మరింత గొప్ప సంపదను, శ్రేయస్సును పొందుతాడు."

**స్వతంత్ర భారత చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం!**

ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనతపై ఎన్‌డీఏ నేతలతోపాటు, వివిధ దేశాల నేతలు, పలు రంగాల ప్రముఖులు నుంచి అభినందనలు తెలియజేశారు. మాజీ రాష్ట్రపతి రామ్?నాథ్ కోవింద్ మాట్లాడుతూ, "మోదీ 12 ఏళ్ల పాలనా కాలాన్ని స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి" అని అభివర్ణించారు. వలస రాజ్యాల పాలన వల్ల భారతీయులలో నాటుకుపోయిన న్యూనతా భావాన్ని దూరం చేయడానికి మోదీ సర్కార్ చేసిన కృషిని ఆయన కొనియాడారు.

**ప్రత్యేక ప్రార్థనలు**

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, మన్సుఖ్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త సహా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నేతలు ప్రధాని మోదీ తరఫున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయాల్లో మోదీ తరఫున పూజలు నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్? సింగ్ చౌహాన్? మాట్లాడుతూ, భారత్?లో అత్యధిక కాలం సేవలు అందించిన ఎన్నికైన ప్రధానిగా మోదీ నిలవడంపై ప్రశంసలు కురిపించారు. ఇది మోదీ పట్ల కోట్లాది మంది భారతీయుల ప్రేమ, నమ్మకం, అపారమైన ప్రజా మద్దతుకు నిదర్శనమని అన్నారు. ప్రధాని మోదీ సాగించిన ఈ 4,399 రోజుల ప్రయాణం శక్తివంతమైన, సంపన్నమైన, అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధ (ఆత్మనిర్భర్?) భారత్ నిర్మాణంలో ఒక 'సువర్ణ అధ్యాయం' అని ఆయన కొనియాడారు.

భారత్?ను అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుదలకు మోదీ చేస్తున్న అపారమైన కృషిని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కొనియాడారు. ఇక భారత్?లో అమెరికా రాయబారిగా ఉన్న సెర్గియో గోర్? కూడా మోదీపై ప్రశంసలు కురిపించారు. "భారత్?లో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన నరేంద్ర మోదీకి అభినందనలు. ఈ ఘనత దశాబ్దాలుగా ఆయన అంకితభావంతో చేసిన ప్రజాసేవకు, బలమైన నాయకత్వానికి నిదర్శనం. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు" అని అన్నారు.

# భూగర్భ జలాలను పెంచేందుకు ఇస్రో ప్రాజెక్ట్

ఛత్తీస్‌గఢ్‌లోని పారిశ్రామిక జిల్లా కోర్బాలో భూగర్భ జలమట్టాల క్షీణిస్తుండడంతో భూగర్భ జల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ (ఎన్‌ఐయూఏ) సహకారంతో దీనిని చేపట్టింది. భారీ బొగ్గు గనులు, విద్యుత్ ప్లాంట్ల కార్యకలాపాల కారణంగా గత ఐదేళ్లలో జిల్లాలో భూగర్భ జలమట్టం సగటున 1.5 నుంచి 2 మీటర్ల వరకు పడిపోయినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమృత్ 2.0 మిషన్ కింద కోర్బాను ఎంపిక చేసి భూగర్భ జల వనరుల నిర్వహణ, పట్టణ భూగర్భ జల వనరుల పునరుద్ధరణ ప్రాజెక్టులను అమలు చేస్తున్నారు. ఇది ఎలా సాగుతుందంటే?

**ఇస్రో సహకారంతో రీఛార్జ్ పిట్**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ జలమట్టం అత్యల్పంగా ఉన్న పది ప్రాంతాలను గుర్తించి, రూ.50 లక్షల వ్యయంతో రీఛార్జ్ పిట్‌లను నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూగర్భ జల మట్టాన్ని పెంచడం, వర్షపు నీటిని సంరక్షించడం, పట్టణాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడాన్ని తగ్గించడం, తాగునీటి సరఫరాను స్థిరంగా కొనసాగించడం, బోర్‌వెల్‌లు ఎండిపోకుండా నివారించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అధికారులు. జిల్లాలోని ఘంటాఘర్ సమీపంలోని సియాన్ సదన్, పంప్ హౌస్ సహా పది ప్రదేశాలను ఈ ప్రాజెక్ట్? కోసం ఎంపిక చేశారు. ఈ ప్రదేశాల్లో భూగర్భ జలమట్టం చాలా తక్కువగా ఉందని, ఈ ప్రాజెక్ట్ పూర్తయితే పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలను పెంచడానికి సహాయపడుతుందని అన్నారు.

**భూగర్భ జలవనరుల్లోకి చేరేలా**

ఈ ప్రాజెక్టులో భాగంగా జల వనరులను పునరుద్ధరించడానికి అనువైన ప్రదేశాలను గుర్తించడానికి ఇస్రో ఉపగ్రహ డేటా, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలను వినియోగించారు. దీని ద్వారా నీరు భూమిలో ఎంత లోతుకు ఇంకుతుందో నిర్ధారించొచ్చు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఆధునిక రీఛార్జ్ పిట్‌లు, ఇంజెక్షన్ బావులు, ఇంకుడు గుంతలు సైతం నిర్మిస్తున్నారు. ఘంటాఘర్‌లోని సియాన్ సదన్ సమీపంలో సుమారు 100 నుంచి 120 అడుగుల లోతుతో ఇంజెక్షన్ బోర్‌వెల్‌లు తవ్వి, వర్ష కాలంలో వచ్చే నీటిని వాటిలోకి మళ్లించే ఏర్పాట్లు చేశారు. ఇంకా నీరు భూగర్భంలోకి వెళ్లే ముందు శిధిలాలు, మట్టి, రసాయనాలను తొలగించేందుకు సరైన వడపోత వ్యవస్థను అమర్చారు. ఇందుకోసం ఒక మీటరు మందంతో కంకర, ఇసుక పొరలు పోసి నీరు వడపోసి భూగర్భ జలవనరుల్లోకి చేరేలా ఆ వ్యవస్థను రూపొందించారు. ఈ పట్టణ నీటి నిర్వహణ పద్ధతిని "షాల్లో ఆక్విఫర్ మేనేజ్‌మెంట్" అంటారు. ఇది తగ్గిపోతున్న భూగర్భ జల మట్టాలను మెరుగుపరచడానికి పట్టణాల్లో నీరు నిలిచిపోకుండా నివారించడానికి దీనిని ఉపయోగిస్తారు.

**ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం ఇదే**

కోర్బాలో సాధారణంగా భూగర్భ జలమట్టం ఉపరితలం నుంచి 3 నుంచి 12 మీటర్ల లోతులో ఉన్నా, బొగ్గు గనులు, పారిశ్రామిక ప్రాంతాలతో వేసవి కాలంలో అది 20 మీటర్ల వరకు పడిపోతుందని అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోయే సమస్యలను కూడా ఈ రీఛార్జ్ గుంతలు తగ్గిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా భూగర్భ జలమట్టాల పునరుజ్జీవనమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని ద్వారా పట్టణ ప్రాంతాల్లో నీటి భద్రత మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్తులో నీటి కొరతను కూడా గణనీయంగా తగ్గించవచ్చని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశుతోష్ పాండే తెలిపారు.

**రూ. 50 లక్షల వ్యయం**

ఇస్రో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ సహకారంతో వీటిని నిర్మిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశుతోష్ పాండే తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పది ప్రదేశాలను గుర్తించగా, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీని మొత్తం వ్యయం రూ. 50 లక్షలని, ఆరు ప్రాంతాల్లో నిర్మాణం ఇప్పటికే పూర్తవగా, మిగిలిన చోట్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ భూగర్భ జల మట్టాన్ని పెంచడంలో ఖచ్చితంగా సహాయపడుతుందన్నారు.

# ఇంజినీరింగ్ డ్రాపౌట్- రూ. 4.63 కోట్ల విలువైన ఆస్తులు



బిహార్ మాజీ సీఎం నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ చదువు గురించి కీలక విషయం బయకొచ్చింది. నిశాంత్ ఇంజినీరింగ్ విద్యను మధ్యలోనే ఆపేసినట్లు తెలిసింది. జూన్ 18న జరగనున్న బిహార్ శాసనమండలి ఎన్నికలలో పోటీ చేసేందుకు నిశాంత్ కుమార్ సహా మొత్తం 10 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో నిశాంత్ ఎన్నికల అఫిడవిట్‌లో తన విద్య, ఆస్తులను పొందుపర్చారు.

**నిశాంత్ కుమార్ ఆస్తులు ఎంతో తెలుసా?**

మంత్రి నిశాంత్ కుమార్ రూ. 4.63 కోట్ల విలువైన చరాస్తులు, స్థిరాస్తులను కలిగి ఉన్నారు. ఇందులో రూ. 17,409 నగదు, రూ. 72,22,805 విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఉన్నాయి. అలాగే నిశాంత్ మ్యూచువల్ ఫండ్స్, పోస్ట్ ఆఫీస్‌లోని నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్(ఎన్‌ఎస్‌సీ)లో పెట్టుబడులు పెట్టారు. హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, కియా సెల్టోస్ కార్లు ఉన్నాయి. వీటితో పాటు పట్నాలోని నలంద, కంకర్బాగ్, షేక్‌పురా, జగన్‌పురా ప్రాంతాలలో భూమి, ఫ్లాట్లు ఉన్నాయి. నిశాంత్‌పై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవు.

**ఇంజినీరింగ్ విద్యను మధ్యలో ఆపేసిన నిశాంత్**

నిశాంత్ తన ఉన్నత విద్యను పూర్తి చేయలేదు. ఆయన 1998లో పట్నా సైన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆ తర్వాత రాంచీలోని ప్రతిష్టాత్మక బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెస్రాలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ కోర్సులో చేరారు. అయితే మొత్తం ఎనిమిది సెమిస్టర్లలో ఐదు మాత్రమే పూర్తి చేశారు. 2001లో మధ్యలోనే చదువు మానేయడంతో ఆ కోర్సును పూర్తి చేయలేకపోయారు. దీంతో ఇంజినీరింగ్ డ్రాపౌట్‌గా నిలిచారు.

**తండ్రి రాజీనామాతో రాజకీయాల్లోకి**

బిహార్ సీఎంగా ఉన్న నీతీశ్ కుమార్ ఆ పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో నిషాంత్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆ తర్వాత సమ్రాట్ చౌధరీ మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అలాగే జేడీయూను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

**రూ.19.44 కోట్ల ఆస్తులున్న పవన్ సింగ్**

మరోవైపు, భారతీయ జనతా పార్టీకి చెందిన పవన్ సింగ్ ఎమ్మెల్సీ పదవి కోసం నామపత్రాలు దాఖలు చేశారు. ఆ ఎన్నికల ఆఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను పొందుపర్చారు. పవన్ సింగ్ రూ. 19.44 కోట్ల విలువైన చరాస్తులు, స్థిరాస్తులను కలిగి ఉన్నారు. ఆయన వద్ద టయోటా ఫార్చ్యూనర్ లెజెండర్, ల్యాండ్ క్రూయిజర్, మహీంద్రా థార్, స్కార్పియో వంటి కార్లు ఉన్నాయి. సుజుకి స్కూటర్ ఉంది. పవన్ సింగ్‌పై ఆరు కేసులు నమోదయ్యాయి. పట్నా, ఆరా, లఖ్‌నవూ, ముంబయిలలో భూమి, వాణిజ్య భవనాలు, ఫ్లాట్లు ఉన్నాయి. అలాగే రూ. 70 లక్షల విలువైన బంగారం కూడా ఉంది.

బీజేపీకి చెందిన మరో అభ్యర్థి సంజయ్ మయూఖ్‌కి టాటా సఫారీ కారు, 100 గ్రాముల బంగారంతో సహా రూ. 1.76 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. అనుమతి లేకుండా ఊరేగింపు నిర్వహించడం, రోడ్డుపై బైఠాయించడం వంటి ఆరోపణలపై పట్నా పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఓ కేసు నమోదైంది. మరో భారతీయ జనతా పార్టీ నేత అనిల్ ఠాకూర్ తన వద్ద 100 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ. 71,000 విలువైన వ్యవసాయ భూమి ఉన్నట్లు వెల్లడించారు. రూ. 60,000 నగదు, రూ. 1,63,000 బ్యాంక్ డిపాజిట్లు ఉన్నట్లు స్పష్టం చేశారు. అలాగే రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, మారుతి డిజైర్ కారు ఉన్నట్లు వెల్లడించారు.

**భారతీ మోహతా ఆస్తులెంతంటే?**

జేడీయూ అభ్యర్థి భారతీ మెహతా ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను ప్రకటించారు. తన వద్ద 620 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి, రూ. 67,000 విలువ చేసే వజ్రం ఉందని పేర్కొన్నారు. నివాస గృహం (ఫ్లాట్), వ్యవసాయ భూమి, టయోటా ఇన్నోవా కారు ఉన్నట్లు భారతీ మోహతా తెలిపారు. మరో జేడీయూ క్యాండిడేట్ లాలన్ ప్రసాద్ వద్ద రూ. 5.60 లక్షల విలువైన చరాస్తులు, రూ. 14.90 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. అలాగే 2007లో కొనుగోలు చేసిన మోటార్ సైకిల్, రూ. 1,00,000 విలువైన బంగారు ఉంగరం ఉంది.

**ఆర్‌జేడీ అభ్యర్థిపై 8 క్రిమినల్ కేసులు**

మరోవైపు, ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆర్‌జేడీ నాయకుడు సునీల్ సింగ్ తన వద్ద రూ. 10.87 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే మారుతి ఎస్టీమ్, హ్యుందాయ్ కార్లతో పాటు రూ. 61 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయని స్పష్టం చేసారు. డబుల్ బారెల్ బ్రీచ్ లోడింగ్ షాట్‌గన్, రివాల్వర్ కూడా ఉన్నట్లు ప్రకటించారు. తనపై ఎనిమిది క్రిమినల్ కేసులు నమోదయ్యాయని అఫిడవిట్‌లో పొందుపర్చారు. కాగా, బిహార్ శాసనమండలిలో 10 స్థానాలు ఖాళీ అయ్యాయి.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం

జాతీయ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. గురువారం పుణెలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం లఖ్‌నవూ, అమృత్‌సర్, జైపూర్, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. అయితే, వచ్చే శనివారం నాటికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే జూన్ 20నుంచి దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని అభిజీత్ తెలిపారు.

**యువత భారీ సంఖ్యలో తరలిరావాలి!**

ఈ ఆందోళనకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో తరలిరావాలని అభిజీత్ పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పత్రాన్ని తీసుకునేంతవరకు ఎవరూ కూడా ఢిల్లీ నుంచి వెనక్కి తిరిగే ప్రసక్తే లేదని, తాను స్వయంగా ఈ ఆందోళనను ముందుండి నడిపిస్తానని ప్రకటించారు. పరీక్ష నిర్వహణలో జరుగుతున్న లోపాలపై యువత ఎంతమాత్రం నిశ్శబ్దంగా ఉండేందుకు సిద్ధంగా లేరని ఆయన స్పష్టం చేశారు. నీట్ పరీక్ష వాయిదా పడటంతో విద్యార్థులు మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్‌తో పాటు సీబీఎస్?ఈలో జరుగుతున్న అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత వహించేందుకు కేంద్రంలో ఎవరూ ముందుకు రావడం లేదని మండిపడ్డారు.

**పుణె నిరసన కార్యక్రమంలో సోనమ్ వాంగ్‌చుక్**

భవిష్యత్తులో వైద్యులుగా మారి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన విద్యార్థులే ఈ విద్యా వ్యవస్థ వల్ల ప్రాణాలను కోల్పోతున్నారని అభిజీత్ దిప్కే దుయ్యబట్టారు. భారత విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి, వ్యవస్థాగత వైఫల్యాల మూల్యాన్ని ఏ విద్యార్థీ చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా చూడటానికి చేపట్టిన ఉద్యమంగా దీన్ని అభివర్ణించారు. అయితే, గురువారం పుణెలో జరిగే నిరసన కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని దీప్కే తెలిపారు. గత శనివారం జంతర్? మంతర్? వద్ జరిగిన నిరసనల్లోనూ సోనమ్? పాల్గొన్నారు. అంతేకాదు, ఆ నిరసనల్లో భాగంగా అభిజీత్‌ను కానీ, సీజేపీ సభ్యులను కానీ పోలీసులు అరెస్టు చేస్తే, 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

**జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ధర్నా**

ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్, సీబీఎస్‌ఈ ఓఎస్‌ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో గత శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్? జనతా పార్టీ ధర్నా నిర్వహించింది. అభిజీత్? పిలుపుమేరకు వేలాదిమంది యువత నిరసన వేదిక వద్దకు తరలివచ్చి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. అయితే, ఈ నిరసనలో దాదాపు 7,000 మంది పాల్గొన్నారని అభిజీత్? దీప్కే ఇటీవల పేర్కొన్నారు. ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సిన బాధ్యతను ప్రధాని తీసుకోవాలన్నారు. దేశంలో ఎన్నికలు గత దశాబ్దకాలంగా హిందూ-ముస్లిం ఎజెండాగా ఉన్నాయని, ఈ ధోరణికి స్వస్తి పలికి, నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పరిగణించాలని ఆయన స్పష్టం చేశారు. పొరుగు దేశాల్లో జరిగిన ఉద్యమాలతో 'కాక్రోచ్' ఉద్యమాన్ని పోలుస్తున్నారని, తమ ఉద్యమం కేవలం 'జెన్ జీ'ల కోసమే ప్రత్యేకమని దీప్కే పేర్కొన్నారు.

## భగ్గుమంటున్న పీఓకే, ప్రగతి పథంలో కశ్మీర్

భారత్, పాకిస్థాన్‌లను విడదీసే నియంత్రణ రేఖ ఇరువైపుల పరస్పర భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఆందోళనలు, హింసాత్మక అల్లర్లతో అట్టుడుకుతుంటే భారత్‌లోని జమ్ముకశ్మీర్ మాత్రం ప్రగతి పథంలో దూసుకెళుతోంది. ాూఖలో ప్రజలపై సైన్యం దమనకాండలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన రోజే కశ్మీర్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా అత్యంత సంక్లిష్టమైన టన్నెల్ నిర్మాణంలో కీలక పురోగతి నమోదైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలను అణిచివేసేందుకు పాకిస్థాన్ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ాూఖలోని రావలాకోట్, ముజఫరాబాద్, మీర్పూర్ వంటి పట్టణాలు అశాంతి, అరెస్టులు, హత్యలతో అట్టుడుకుతున్నాయి. ఈ ప్రాంతంలో పాక్ ప్రభుత్వ ఆధిపత్యాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో అక్కడికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత జమ్ముకశ్మీర్‌లో 'జోజిలా టన్నెల్' నిర్మాణంలో కీలక ఘట్టం పూర్తికావడంతో ఇంజినీర్లు సంబరాలు చేసుకున్నారు. హిమాలయ లోతుల్లో వ్యూహాత్మక జోజిలా టన్నెల్ 'బ్రేక్‌త్రూ'ను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. పూర్తయిన తర్వాత ఆసియాలోనే అత్యంత పొడవైన ద్విముఖ సొరంగంగా ఇది రికార్డు సృష్టించనుంది. జమ్ముకశ్మీర్‌ను లద్దాఖ్‌తో అనుసంధానించే ఈ సొరంగం అన్ని కాలాల్లోనూ ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది. ఇలా నియంత్రణ రేఖకి ఇరువైపులా ఉన్న కశ్మీర్‌లో పరస్పర భిన్నమైన పరిస్థితులకు ఈ రెండు ఘటనలే సజీవ సాక్ష్యం. 1947లో పాకిస్థాన్ దుశ్చర్యల కారణంగా విడిపోయిన ఈ రెండు ప్రాంతాల ప్రస్తుత వాస్తవ పరిస్థితులను ఈ ఘటనలు కళ్లకు కడుతున్నాయి. జమ్ముకశ్మీర్, లద్దాఖ్, గిల్గిత్-బాల్టిస్థాన్, షక్స్‌గామ్ లోయలు భారత్‌లో అంతర్భాగం కాగా 1947 నుంచి పాకిస్థాన్ కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకుని దురాగతాలకు పాల్పడుతోంది. పాలనలో పాక్ సైన్యం ఆధిపత్యం, నిత్యావసరాల ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ పీవోకే ప్రజలు చాలా ఏళ్లుగా నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. ప్రస్తుత ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న జీూాజ కూడా ఆర్థిక కష్టాలకు వ్యతిరేకంగానే ఉద్భవించింది. పిండి, కరెంటు సబ్సిడీ ఇవ్వాలని, రాజకీయ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ 2024, 2025లో తీవ్ర ఆందోళనలు జరిగాయి. వీటిని పాక్ భద్రతా బలగాలు టియర్ గ్యాస్, తూటాలతో దారుణంగా అణిచివేశాయి. అనేకమంది ప్రాణాలు బలి తీసుకున్నాయి. ఈ నిరసనల్లో పాక్ నుంచి తమకు స్వాతంత్ర్యం కావాలంటూ స్థానికులు నినాదాలు చేశారు. పీఓకేలోని వనరులను దోచుకుంటూ, పాక్ అవలంబిస్తున్న అణచివేత విధానాల ఫలితమే ఈ అశాంతి, హింస అని భారత్ స్పష్టం చేసింది. మరోవైపు గడిచిన దశాబ్ద కాలంగా జమ్ముకశ్మీర్ ప్రగతి ప్రథంలో పరుగులు పెడుతోంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన భారీగా పెరిగింది. పెద్దఎత్తున జాతీయ రహదారులు, సొరంగాలు, రైల్వేలు, విద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక మౌలిక సదుపాయాలపై కేంద్రం భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2021కి ముందు కేవలం 450 కోట్లుగా ఉన్న వార్షిక పెట్టుబడులు 2025-26 నాటికి 5వేల 824 కోట్లకు చేరాయి. లక్షా 60వేల కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. 2020లో ఇక్కడ 69 స్టార్టప్‌లు మాత్రమే ఉండగా, ప్రభుత్వ ప్రత్యేక విధానాలు, ఇంక్యుబేటర్లు, సీడ్-ఫండింగ్ మద్దతుతో 2025-26 నాటికి ఆ సంఖ్య 13వందలు దాటింది.

జెడ్-మోర్ టన్నెల్, చీనాబ్ రైల్వే బ్రిడ్జి, కొత్త హైవేలు ఇక్కడి ప్రగతికి నిదర్శనాలు. మంచు కొండలు, పచ్చని లోయల నుంచి. వందేభారత్ రైళ్లు పరుగులు తీయడం కొన్నేళ్ల క్రితం ఊహకు కూడా అందని దృశ్యం ఇప్పుడు కనిపిస్తోంది. కశ్మీర్‌లో కనిపిస్తున్న ఈ స్పష్టమైన అభివృద్ధి పాకిస్థాన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అందుకే పహల్గామ్ లాంటి దాడుల ద్వారా అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని భద్రతా విశ్లేషకులు చెబుతున్నారు.

## కాంగ్రెస్‌లో తృణమూల్ కాంగ్రెస్ విలీనంపై చర్చలు!?

తృణమూల్ కాంగ్రెస్? పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయనున్నారని వస్తున్న వార్తలను మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గాలు బుధవారం ఖండించాయి. తమకు అలాంటి ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశాయి. మంగళవారం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మధ్య భేటీ జరిగింది. అంతకు ముందు రోజు ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వీరిద్దరూ ఆలింగనం చేసుకున్న ఒక ఫొటోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అయితే ఆ ఇరువురు మహిళా నేతల సమావేశానికి సంబంధించిన వివరాలను మాత్రం ఇరుపార్టీలు అధికారికంగా వెల్లడించలేదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్?లో టీఎంసీ విలీనంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే కాంగ్రెస్?లో తృణమూల్ కాంగ్రెస్? విలీనం కానుందనే ప్రచారాన్ని ఒక సీనియర్? టీఎంసీ నేత తోసిపుచ్చారు. వీటిని ఆధార రహితమైన వార్తలుగా అభివర్ణించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137